





తిమ్మరాజు వీధిలో ఇదీ దుస్థితి

ఆధ్యాత్మిక ధామం.. సమస్యలతో సతమతం

పిఠాపురం 18వ వార్డులో సమస్యలపై ఫోకస్

పిఠాపురం ప్రముఖ పుణ్యక్షేత్రాలకు నెలవు. మరిన్ని క్షేత్రాలకు ఇదే ప్రాంతం మీదుగా వెళ్లాలి. ఇంత ప్రాధాన్యమున్న ఈ ప్రాంతంలో సమస్యలు అనేకం ఉన్నాయి. వీటి పరిష్కారంపై గత ప్రభుత్వం నిర్లక్ష్యం చూపడంతో నిధులున్నా పనులు ముందుకు సాగలేదు. రహదారులు, డ్రైన్లను సగం సగం నిర్మించి వదిలివేయడంతో ప్రజలకు ఇక్కట్లు తప్పట్లేదు. నిత్యం వందలాది మంది భక్తులు, ఉత్సవాల సమయంలో వేలాది మంది భక్తులు రాకపోకలు సాగించే మార్గాల్లో పారిశుధ్య నిర్వహణ అంతంతమాత్రంగానే ఉంటోంది. 18 వార్డు సమస్యలపై కథనం.. 6

పాఠకుల చెంతకే 'ఆంధ్రజ్యోతి'

అక్షరంతో ఏం చేయగలం!?
సమాజంలో చైతన్యం తేగలం..
ప్రజాగళమై పోరాటం చేయగలం..
నేతలకు దిశానిర్దేశం చేయగలం..
సమస్యలను ఎత్తిచూపగలం.. పరిష్కరించగలం..
ఇప్పటివరకూ ఆ అక్షరమే ఆంధ్రజ్యోతి బలం..
తెల్లటికాగితంపై.. నల్లటి అక్షరాలతో
ఎన్నో అద్భుతాలు సృష్టించింది..
అక్షరమనే ఆయుధంతో ఎన్నో సాధించింది..
ఇప్పుడు మరో కొత్త అడుగు వేయబోతోంది..

మంగళవారం నుంచి పాఠకుల చెంతకే వస్తోంది.. సమస్యలపై గళమెత్తబోతోంది.. రాష్ట్ర సమస్యలే కాదండోయ్.. మీ వీధి.. మీ ఊరు.. మీ వార్డు.. మీ డివిజన్.. సమస్య ఏదయినా సరే.. ప్రజలకు.. ప్రజాప్రతినిధులు.. అధికారులకు మధ్య వారధిగా నిలిచి పరిష్కారంలో భాగం కానుంది.. తొలుత ఈ కార్యక్రమాన్ని మంగళవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం 9వ డివిజన్ వెంకటేశ్వరనగర్.. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం 3వ వార్డు.. కాకినాడ జిల్లా పిఠాపురం 18వ వార్డుల్లో శ్రీకారం చుడుతోంది.. మీరు చేయాల్సిందల్లా ఒక్కటే.. మీ చెంతకు వచ్చిన ఆంధ్రజ్యోతి వద్దకు రండి.. మీకు తోడుంటాం.. మీ సమస్యలేమిటో చర్చిద్దాం..!


సంప్రదాయ నృత్య ప్రదర్శనలిచ్చిన విద్యార్థినుల కవాతు

సమష్టి కృషితోనే సమగ్రాభివృద్ధి








పరేడ్‌లో సైనిక వందనం అందుకుంటున్న కలెక్టర్

పతాకావిష్కరణ చేస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్, హాజరైన జిల్లా అధికారులు.. కలెక్టర్ ఉపన్యాసం

- ప్రజా భాగస్వామ్యం, సత్వర అభివృద్ధి లక్ష్యాలతో ముందుకు సాగుతాం
- రాష్ట్ర ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాల ప్రాధాన్యతలను అమలు చేస్తాం
- జిల్లాలో రైతు గ్రూపులకు 80 శాతం రాయితీపై డ్రోన్‌ల పంపిణీకి ప్రణాళికలు
- ఇకపై ఎక్కువ ఆదాయాన్ని ఇచ్చే చిరుధాన్యాలు,బ్లాక్‌రైస్ సాగుకు ప్రోత్సాహం
- ప్రభుత్వ పాఠశాలలను ఉత్తమ ప్రమాణాలతో తీర్చిదిద్దడానికి ప్రణాళికలు సిద్ధం
- ఇళ్లు లేని నిరుపేదలకు సొంతింటి నిర్మాణానికి రూ.2.50 లక్షల సాయం
- ఎన్టీఆర్ హౌసింగ్ కింద ఇళ్ల లబ్ధిదారులకు త్వరలో రూ.49 కోట్ల బిల్లులు
- త్వరలో రూ.480 కోట్లతో జిల్లాలో సాగునీటి వ్యవస్థల ఆధునికీకరణ
- 76వ గణతంత్ర వేడుకల్లో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ వెల్లడి
- ఆకట్టుకున్న పోలీసు కవాతు, శకటాలు, సాంస్కృతిక ప్రదర్శనలు

కాకినాడ(ఆంధ్రజ్యోతి)/కాకినాడ సిటీ, జనవరి 26: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలను అమలు చేస్తామని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. అందరి భాగస్వామ్యంతో సమష్టి కృషిగా జిల్లాను ప్రగతిపథంలో నడిపిస్తామన్నారు. 76వ గణతంత్ర దినోత్సవం ఆదివారం కాకినాడ పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా జరిగింది. జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. జిల్లాలో రైతు గ్రూపులకు 80 శాతం రాయితీపై డ్రోన్‌ల పంపిణీకి ప్రణాళికలు సిద్ధం చేసినట్టు పేర్కొన్నారు. ఇకపై ఎక్కువ ఆదాయాన్ని ఇచ్చే చిరుధాన్యాలు, బ్లాక్‌రైస్ సాగుకు ప్రోత్సాహం కల్పిస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలలను ఉత్తమ ప్రమాణాలతో తీర్చిదిద్దడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్టు వివరించారు. అలాగే జిల్లాలో ఇళ్లులేని నిరుపేదలకు సొంతింటి నిర్మాణానికి రాష్ట్రప్రభుత్వం ఎంపిక చేసిన లబ్ధిదారులకు రూ.2.50 లక్షల ఆర్థిక సాయం చేయనున్నట్టు చెప్పారు. వ్యవసాయ రంగం ప్రధానంగా ఉన్న జిల్లాలో త్వరలో రూ. 480 కోట్లతో సాగునీటి వ్యవస్థల ఆధునికీకరణ చేస్తామని వివరించారు. ఇంకా ఏమన్నారంటే..

రైతు లబ్ధి కలిగేలా సాగు..

రైతు సంక్షేమమే లక్ష్యంగా గత ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో రూ.6,330 కోట్లు, రబీ సీజన్‌లో ఇప్పటివరకు రూ.620 కోట్లు రుణాలు పంపిణీ చేశాం. 20,484 మంది కౌలురైతులకు రూ.79.33 కోట్లు పంటరుణాలు మంజూరు చేశాం. అధిక వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు రూ.18.68 లక్షల ఇన్‌పుట్ సబ్సిడీ జమ చేశాం. పీఎం కిసాన్ పథకం ద్వారా 1,32,801 రైతు కుటుంబాలకు రూ.52 కోట్లు పెట్టుబడి సాయం అందించాం. ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పిస్తూ 1,48,044 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతుల ఖాతాలకు రూ.339 కోట్ల చెల్లింపులను 48 గంటల్లోనే జమచేశాం.అలాగే రాష్ట్రీయ కృషి వికాస యోజన ద్వారా ఈఏడాది 165 హెక్టార్లలో ఉద్యాన పంటలు చేపట్టాం. 3 వేల హెక్టార్లలో ఆయిల్ పామ్ తోటలు విస్తరిస్తున్నాం. అలాగే వ్యవసాయాన్ని లాభసాటిగా చేయడం కోసం త్వరలో రైతు గ్రూపులకు 80శాతం రాయితీపై డ్రోన్‌ల పంపిణీకి ప్రణాళికలు సిద్ధం చేశాం. అధిక లాభాలను ఇచ్చే చిరు ధాన్యాలు, రెడ్‌రైస్, బ్లాక్‌రైస్ రకాల సాగును ఇకపై భారీగా ప్రోత్సహిస్తాం. జిల్లాలో పీఎంఎస్ఎస్‌వై ద్వారా రూ.2.43కోట్ల విలువైన 338 యూనిట్లను మత్స్యకారులకు మంజూరు చేశాం. ఫిషింగ్ బోట్లకు డీజిల్‌పై రూ.6.44 కోట్ల సబ్సిడీ అందించాం. సముద్రంలో వేటకు వెళ్లి మరణించిన 13 మంది మత్స్యకార కుటుంబాలకు రూ.65 లక్షల ఎక్స్‌గ్రేషియో పంపిణీ చేశాం. ఓఎన్జీసీ పైపులైన్ పనుల వలన జీవనోపాధి కోల్పోయిన మత్స్యకారులకు రూ.243 కోట్లు చెల్లించాం.

గృహ ప్రవేశాలకు సిద్ధం..

జిల్లాలో స్వయం సహాయక సంఘాలకు డీఆర్డీఏ ద్వారా రూ.వెయ్యికోట్ల వరకు, మెప్మా ద్వారా రూ.425 కోట్లు బ్యాంకు రుణాలు కల్పించాం. రూ.133.22 కోట్లతో గ్రామాల్లో సీసీ రోడ్లు, బీటీ రోడ్ల అభివృద్ధికి 1,149 పనులు చేపట్టాం. జిల్లాలో 1,253 పాఠశాలల్లో చదువుతున్న 1,33,258 మంది విద్యార్థులతో పాటు ఇంటర్ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నాం. ఎన్టీఆర్ వైద్యసేవ పథకం ద్వారా ఇప్పటివరకు జిల్లాలో రూ.176 కోట్ల విలువైన 93,142 చికిత్సలను పేదలకు ఉచితంగా అందించాం. కాకినాడ జీజీహెచ్‌లో కేన్సర్ రోగులకు చికిత్సకోసం ప్రివెంటివ్ అంకాలజీ, పాలియేటివ్ కేర్ ఓపిడిలను, 6 పడకల ఐసీయు ఏర్పాటుచేశాం. అలాగే 100 రోజుల ప్రణాళికతో పేదల కోసం ఈ నెలాఖరునాటికి 4,398 గృహాల నిర్మాణం పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం చేస్తున్నాం.

మరెన్నో అభివృద్ధి పనులకు శ్రీకారం

దీపం-2 పథకం ద్వారా జిల్లాలో 5.12 లక్షల మంది అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ఇప్పటి వరకు 3.98 లక్షల మందికి రూ.30.79కోట్ల సబ్సిడీని వారి ఖాతాల్లో జమచేశాం. బీసీ కార్పొరేషన్ ద్వారా వెనుకబడిన తరగతులకు రూ.33.46 కోట్లు, ఈబీసీలకు రూ 2.25 కోట్లు, కాపు కార్పొరేషన్ ద్వారా రూ.25.24కోట్ల ఆర్థికసాయం అందిస్తున్నాం. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం కింద ఈ ఏడాది 600 మందికి రూ.1.68 కోట్లతో ఉపకరణాలు, ఇతర ప్రయోజనాలు కల్పించాం. జిల్లాలో 400కి.మి. పొడవునా రహదారుల గుంతలను పూడ్చేందుకు రూ.29.75 కోట్లతో 121 పనులు చేపట్టాం. సంక్రాంతికి చాలావరకు రహదారులను మరమ్మతు పూర్తి చేశాం. రూ.28కోట్ల సీఐఆర్ఎఫ్ నిధులతో 9.7 కి.మీ. రోడ్లు, తాండవపై హైలెవెల్ వంతెన చేపట్టాం. జిల్లాలో ఎంఎస్ఈ- సీడీపీ ప్రోగ్రాం ద్వారా రూ.55.53 కోట్ల పెట్టుబడితో 3 పారిశ్రామిక క్లస్టర్లను, రూ 13.30 కోట్ల నిధులతో పెద్దాపురంలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ అభివృద్ధి చేస్తున్నాం. విద్యార్థులు, ప్రయాణికుల కోరిక మేరకు జిల్లాలో కొత్తగా 13 గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాం. కొత్తగా 40 బస్సులను కొనుగోలు చేశాం. జిల్లాలోని గ్రామ పంచాయతీలకు రూ.56.20 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులు కేంద్ర ప్రభుత్వం ద్వారా, వివిధ గ్రాంట్ల కింద రూ 4.19 కోట్ల నిధులు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ వేడుకల్లో నిర్వహించిన పోలీసు పరేడ్, శకటాలు అందరినీ ఆకట్టుకున్నాయి. వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యరీతులు అందరినీ అలరించాయి. ఈ వేడుకలకు విశిష్ట అతిథులుగా ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, పంతం నానాజీ, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, కాకినాడ అర్బన్ డవలప్మెంట్ అథారిటీ చైర్మన్ తుమ్మల రామస్వామి, ఎస్పీ విక్రాంత్‌పాటిల్, జేసీ రాహుల్ మీనా, కాకినాడ కార్పొరేషన్ కమిషనర్ భావన, అడిషనల్ ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, అసిస్టెంట్ కలెక్టర్ హెచ్ఎస్ భావన, ట్రైనీ ఐపీఎస్ సుస్మిత, డీఆర్వో జె వెంకట్రావు, ఆర్డీవో ఎస్ మల్లిబాబు, అర్బన్ తహశీల్దార్ వి.జితేంద్ర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




కలెక్టర్ నుంచి ఉత్తమ పురస్కారాలు అందుకుంటున్న కేఎస్ ధర్మశాస్త్ర (పోర్టు ఆఫీసర్), పి త్రినాథ్ (చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్), పి రమేష్ (డీఈవో), ఎన్ విజయ్‌కుమార్ (జిల్లా వ్యవసాయాధికారి), కె కరుణాకరరావు (మత్స్యశాఖ జేడీ), ఎస్ మల్లిబాబు (ఆర్డీవో), త్రినాధరావు (తాళ్లరేవు ఎమ్మార్వో), కేటీ సుధాకర్ (కాకినాడ కార్పొరేషన్ ఏడీసీ), మురళీకృష్ణ (మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్), సి బాబూరావు (అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్), జి.సతీష్‌బాబు (ఆఫీస్ సబార్డినేట్), డాక్టర్ జే నరసింహ నాయక్ (డీఎంహెచ్‌వో), ఎం నాగదుర్గారావు (వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్), ఉత్తమ టీచర్ అవార్డుదారులకు సత్కారం, సామర్లకోట వీఆర్ఎల్ జూనియర్ కాలేజీ చెస్ క్రీడాకారుడు జి సాయిసంతోష్

ఆకట్టుకున్న సాయుధ దళాల కవాతు.. ఆకట్టుకున్న స్టాళ్లు

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 26(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆర్మడ్ రిజర్వుడ్, సివిల్, క్విక్ రియాక్షన్ టీం, ఉమెన్ కంటెన్జెంట్, హోంగార్డు, రెడ్‌క్రాస్ దళాలు నిర్వహించిన సంప్రదాయ కవాతు ఆహుతులను అలరించింది. ఈ ప్రదర్శనలో ఉత్తమ కవాతుకుగాను ప్రథమ బహుమతి ఆర్మడ్ రిజర్వుడ్ పోలీస్, ద్వితీయ బహుమతి క్విక్ రియాక్షన్ టీం, ఉమెన్ కంటెన్జెంట్ తృతీయ బహుమతి, రెడ్‌క్రాస్‌కు కన్సొలేషన్ బహుమతిని కలెక్టర్, ఎస్పీ చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఇక ఉత్తమ స్టాల్స్ జిల్లా మత్స్యశాఖకు ప్రథమం, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీ, డ్వామా శాఖలకు ద్వితీయ, హార్టికల్చర్, సెరికల్చర్, ఏపీఎంఐపీ తృతీయ బహుమతులందాయి.

శకటాల ప్రదర్శనలో వన్.. టు.. త్రి...

గణతంత్ర దినోత్సవం సందర్భంగా అన్నవరం సత్యనారాయణస్వామి దేవస్థానం, గృహ నిర్మాణం, పాఠశాల విద్య, వైద్య ఆరోగ్యం, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, జిల్లా ఆటవీ, విద్యుత్ శాఖలు తమ పథకాలపై శకటాలు ప్రదర్శించాయి. ఈ ప్రదర్శనలో ప్రథమం డ్వామా, ద్వితీయ విద్యుత్, తృతీయ వైద్య ఆరోగ్య శాఖలు బహుమతులు అందుకున్నాయి.

డ్వామా శకటం


విద్యుత్ శకటం


పాఠశాల విద్యార్థుల పరీక్షల షెడ్యూల్ ఇదీ..

సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పేపర్-3గా

నేటి నుంచి ప్రారంభం

సామర్లకోట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో 1వ తరగతి నుంచి పదో తరగతి వరకూ చదువుతున్న విద్యార్థుల పరీక్షల షెడ్యూల్‌ను విద్యా శిక్షణమండలి పరిశోధనా సంస్థ(ఎస్సీఈఆర్టీ) కార్యాలయం నుంచి విడుదలైంది. జిల్లాలోని అన్ని మండల విద్యా వనరుల కేంద్రాలకు ఈ మేరకు పరీక్షల షెడ్యూల్ అందాయి. ఇప్పటివరకూ ఫార్మెటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్ఏ-1) పేరును ఇకనుంచి సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పేపర్‌గా పరిగణించాలని ఎస్సీఈఆర్టీ కార్యాలయం నుంచి అందిన ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ పరీక్షలు ఈనెల సోమవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. 30 వరకూ నిర్వహిస్తారు. గతేడాది వరకూ ఈ పరీక్షలను రోజుకు రెండు చొప్పున ఉదయం, మధ్యాహ్నం నిర్వహించేవారు. గత ఆగస్టు నెల నుంచి పరీక్షల షెడ్యూల్‌ను కొద్దిగా మార్పులు చేశారు. అయితే ప్రస్తుతం రోజుకు ఒకటి చొప్పున ఏడు రోజులపాటు పరీక్షలు నిర్వహిస్తారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఈనెల సోమవారం నుంచి 30 వరకూ ఉదయం 10.00 గంటల నుంచి 11.00 గంటల వరకూ ఓఎస్ఎస్ఎస్ నిర్వహిస్తారు. కాగా జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 1 నుంచి 10 తరగతుల వరకూ 1 లక్షా 33 వేల 048 మంది విద్యార్థులు ఎఫ్ఏ-3 పరీక్షకు హాజరయ్యేందుకు సిద్ధమైనట్టు జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారి తెలిపారు.

నాటిక రచనల పోటీల్లో విజేతల వివరాలు

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో పంపన సంస్కృతీ పురస్కార్ ఆధ్వర్యంలో నిర్వహించిన నాటిక రచనల పోటీల్లో విజేతల వివరాలను ప్రకటించారు. దంటు కళాక్షేత్రంలో ఆదివారం జరిగిన కార్యక్రమానికి పంపన సంస్కృతీ పురస్కార్ అధ్యక్షుడు పంపన దయానందబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో నాటిక రచనల పోటీల న్యాయ నిర్ణేతలు సాంస్కృతిక శాఖ మాజీ సీఈవో డి.విజయభాస్కర్, చరిత్ర పరిశోధకులు కందిమండ్ల సాంబశివరావు, వాడ్రేవు సుందరరావులు పాల్గొని విజేతల వివరాలు తెలియజేశారు. ప్రథమ బహుమతిని ముడుపు గెలుచుకోగా, దీనికి రచయిత సింహప్రసాద్ (హైదరాబాద్), రెండో బహుమతిని మనిషికన్నా శవం మిన్న నాటిక గెలుచుకోగా, దీనికి రచయిత ఎం.దుర్గాప్రసాద్ (విజయనగరం), తృతీయ బహుమతిని జనరల్ బోగీలు గెలుచుకోగా, దీనికి రచయిత పీటీ మాధవ్ (విశాఖ), ప్రత్యేక బహుమతిని ఆత్మ(హత్య) గెలుచుకోగా, దీనికి రచయిత కేబీ ఆనంద్ (సామర్లకోట), కన్సొలేషన్ బహుమతులను పసిడివనం, దీనికి రచయిత స్నిగ్ధ(కాకినాడ), గేమ్ నాటిక, దీనికి రచయిత డి.మంజునాథ్ (హైదరాబాద్), కర్మశాల నాటిక గెలుచుకోగా, దీనికి రచయిత బొక్కా శ్రీనివాసరావు(హైదరాబాద్),వెలుతురు వెనుక నాటిక గెలుచుకోగా, దీనికి రచయిత రావి నాగేశ్వరావు (చోడవ రం), సూక్తం నాటిక గెలుపొందగా కేవీవీ సత్యనారాయణ (హైదరాబాద్) గెలుపొందారు. విజేతలకు వచ్చే ఏప్రిల్ 20వ తేదీన సీతారామరాజు స్మారక కళావేదిక 41వ వార్షికోత్సవం సందర్భంగా నగదు బహుమతులు అందజేయనున్నట్టు తెలిపారు. సీతారామ స్మారక కళావేదిక అధ్యక్షుడు కర్రి అచ్యుతరామారెడ్డి, మార్ని జానకిరామ్‌చౌదరి, కర్రి భామిరెడ్డి, ఎస్వీఆర్ బాపిరాజు, ఎన్.ప్రభుదాస్, పీవీవీఎస్ఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు 4



తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో భరత జాతి గొప్పదనాన్ని వివరిస్తూ విద్యార్థినుల నృత్య రూపకం



తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఆసనంతో ఆకట్టుకున్న విద్యార్థిని

దేశభక్తి... వెల్లువెత్తి...



కాకినాడలో భరతమాత వేషధారణలో పరేడ్‌లో పాల్గొన్న విద్యార్థిని



గణతంత్ర వేళ... సాంస్కృతిక హేల

కాకినాడ సిటీ/రాజమహేంద్రవరం సిటీ/అమలాపురం టౌన్: గణతంత్ర సంబరాల్లో సాంస్కృతిక ప్రదర్శనలు అంబరాన్నంటాయి. కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో 76వ గణతంత్ర దినోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా దేశభక్తిని చాటేలా విద్యార్థులు, చిన్నారుల ప్రదర్శనలు అలరించాయి. నృత్యాలు, స్కిట్స్‌లను చూసి ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆహుతులు మంత్రముగ్ధులయ్యారు.



మేరా భారత్ మహాన్ (కాకినాడలో జాతీయ జెండాతో చిన్నారి)



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు



స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలతో ఆకట్టుకున్న కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం వలసపాకల ఎలిమెంటరీ స్కూలు విద్యార్థులు



76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా కాకినాడ జిల్లా జగ్గంపేట శ్రీప్రజ్ఞ స్కూలు విద్యార్థుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. జాతీయ పతాకావిష్కరణ అనంతరం మెయిన్‌రోడ్డులో దేశభక్తి గీతాలతో శోభాయాత్ర నిర్వహించారు.

సర్టిఫికెట్‌కు ఓ రేటు ..!

- సూరంపాలెం వీఆర్వో నిర్వాకం
- కలెక్టర్‌ను ఆశ్రయించిన బాధితురాలు

గండేపల్లి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గండేపల్లి మండలం సూరంపాలెం వీఆర్వో ప్రతి సర్టిఫికెట్‌కు ఓ రేటు నిర్ణయించినట్టు తెలిసింది. సదరు ఉద్యోగికి ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు సైతం వత్తాసు పలుకుతు న్నా రంటూ ఆ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాలివి... సూరంపాలెంకు చెం దిన అడ్డాల అనంతలక్ష్మికి ఐదుగురు సంతానం కాగా, వీరిలో ముగ్గురికి జనన నమోదు సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకుంది. అయితే గ్రామ పంచాయతీ కార్యాలయం చుట్టూ ఎన్ని ప్రదక్షిణలు చేసినా... పట్టించుకోకపోవడంతో ఆమె కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస రావును ఆశ్రయించింది. ఆయన సహకారంతో కలెక్టర్‌కు బాధితురాలు ఫిర్యాదు చేసింది. దీంతో కలెక్టర్ పెద్దాపురం ఆర్డీవో, గండేపల్లి తాసిల్దార్‌కు ఆదేశాలు జారీ చేయడంతో అసలు విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఒక్కొక్క పత్రానికి ఐదు వేల రూపాయలు చొప్పున్న డిమాండ్ చేసినట్టు సమాచారం. అయితే ఇదే గ్రామంలోని సుమారు 40 నుంచి 50 మంది విద్యార్థులు జనన సర్టిఫికెట్ల కోసం పంచాయతీ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని, వెంటనే జిల్లా అధికారులు స్పందించాలని కోరుతున్నారు. దీనిపై వీఆర్వో స్పందిస్తూ వాళ్లని లంచం అడగలేదని, సర్టిఫికెట్ ఎంక్వైరీ ఆలస్యం అవ్వడం వల్లే ఫిర్యాదు ఇచ్చారన్నారు.

న్యాయనిర్ణేతలుగా ఇద్దరు క్రీడాకారుల ఎంపిక


అమలాపురం రూరల్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో నిర్వహించే బ్యాడ్మింటన్ పోటీలకు న్యాయనిర్ణేతలుగా అమలాపురం రూరల్ మండలానికి చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ మేరకు వారికి ఉత్తర్వులు అందాయి. ఈనెల 28 నుంచి ఫిబ్రవరి 14 వరకు ఉత్తరాఖండ్‌లో జరిగే నేషనల్ గేమ్స్‌లో బ్యాడ్మింటన్ పోటీలకు ఈదరపల్లి అలవైకుంఠపురం కాలనీకి చెందిన అడపా శ్రీనివాస్, కామనగరువు జిల్లా_పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న గొలకోటి శ్రీనివాస్‌ను బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నేషనల్ ఎంపైర్లుగా నియమించింది. గతంలో వీరిద్దరు పలు జాతీయ టోర్నమెంట్లకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. వీరిని బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అంకమ్మచౌదరి ఉమ్మడి జిల్లా అసోసియేషన్ కార్యదర్శి కొత్తపల్లి బాలు, కోనసీమ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మెట్ల రమణబాబు, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు, ఆఫీసర్స్ క్లబ్ కార్యదర్శి రంకిరెడ్డి కాశీవిశ్వనాథం, హెచ్ఎం వీ.చక్రధరరావు అభినందించారు.



అడపా శ్రీనివాస్, గొలకోటి శ్రీనివాస్

పాపికొండల్లో జన సందడి

- పది పర్యాటక బోట్లు ఏర్పాటు



పాపికొండలు విహార యాత్రకు వెళ్తున్న పర్యాటక బోటు

దేవీపట్నం, జనవరి 26(ఆంధ్రజ్యోతి): పాపికొండల అందాలను తిలకించేందుకు తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి పర్యాటకులు ఆదివారం పెద్దసంఖ్యలో విచ్చేశారు. పది బోట్లలో సుమారు 466 మంది అందాలను తిలకించారు. ముందుగా మాతృశ్రీ గండిపోశమ్మ తల్లిని దర్శించుకుని గోదావరి పరీవాహక ప్రాంతాలైన పూడిపల్లి, తొయ్యేరు, దేవీపట్నం, అగ్రహారం, మూలపాడు, మంటూరు, కొండమొదలు, తదితర గ్రామాల మీదుగా పేరంటాలపల్లికి వెళ్లారు. ప్రసిద్ధి పుణ్యక్షేత్రంగా పేరుగాంచిన మాతృ శ్రీ గండిపోశమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు.

దర్శన టిక్కెట్లు, తదితర వాటి ద్వారా రూ.16,600 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

విద్యార్థులకు రాజ్యాంగ స్ఫూర్తి అవసరం

- సంవిధాన్ ర్యాలీలో మంత్రి దుర్గేష్, ఎంపీ పురంధేశ్వరి, ఎమ్మెల్యేలు

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు రాజ్యాంగ స్ఫూర్తిని అలవర్చుకోవాలని రాజమండ్రి ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం రాజమహేంద్రవరంలో సంవిధాన్ ర్యాలీ నిర్వహించారు. కోటిపల్లి బస్టాండు సెంటర్లోని స్వాతంత్ర్య సమరయోధుల పార్కు నుంచి గోదావరి గట్టు ఛాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్టు హాలు వరకు జరిగిన ఈ ర్యాలీలో ఎంపీతోపాటు రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మద్దిపాటి వెంకట్రాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో జరిగిన సభలో పురందేశ్వరి, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగానికి అనేక సవరణలు చేయడం ద్వారా కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగ స్ఫూర్తిని నిర్వీర్యం చేసే ప్రయత్నం చేసిందని విమర్శించారు. రాజ్యాంగానికి 41వ సవరణ చేస్తూ సెక్యులర్ అనే పదాన్ని పీఠికలో పొందుపర్చారన్నారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం మనకు దిక్సూచి వంటిదన్నారు. సభలో బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు సోము వీర్రాజు, జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, కోడూరి లక్ష్మీనారాయణ, పరిమి రాధ, బొమ్ముల దత్తు, వీరా వీరాంజనేయులు, హారిక, క్షత్రియ బాలసుబ్రహ్మణ్యసింగ్, తదితరులు పాల్గొన్నారు. ముందుగా ఎంపీ పురందేశ్వరి స్వాతంత్ర్య సమరయోధుల పార్కులోని 12 మంది మహిళా స్వాతంత్ర్యయోధుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



బీజేపీ సంవిధాన్ అభియాన్ ర్యాలీలో మంత్రి దుర్గేష్, ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యేలు గోరంట్ల , నల్లమిల్లి

ముగిసిన రాష్ట్ర స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు

పెద్దాపురం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంచంద్రమాంపల్లి (దివిలి)లో స్నేహఆర్ట్స్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఆహ్వాన నాటికల పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల రాష్ట్రస్థాయి నాటిక పోటీల్లో చివరి రోజు ముఖ్య అతిథిగా ఏపీ సాంస్కృతిక నాటక పరిషత్ సమాఖ్య అధ్యక్షుడు బుద్దాల వెంకటరామారావు హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో స్నేహ ఆర్ట్స్ అధ్యక్షుడు గొందేసి రాజా, ఇంధన బ్రహ్మానందం, కొత్తిం స్వామినాథన్, దేవాడ పాపేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అమరావతి ఆర్ట్స్ (గుంటూరు) ఆధ్వర్యంలో ప్రదర్శించిన చిగురు మేఘం నాటిక ఎంతగానో ఆకట్టుకుంది. ఈ నాటికను కావూరి సత్యనారాయణ రచన చేయగా, ఏపూరి హరిబాబు దర్శకత్వం వహించారు. మిత్రా క్రియేషన్స్ (హైదరాబాద్) ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఇది రహదారి కాదు నాటిక అలరించింది. ఈ నాటికను ఆకురాతి భాస్కరచంద్ర రచించగా ఎంఎం బాషా దర్శకత్వం వహించారు. స్నేహఆర్ట్స్ (చంద్రమాంపల్లి) ప్రదర్శించిన 'చచ్చిన నాటిక' ఆకట్టుకుంది. నాటికకు రచన బర్రే సత్యనారా యణ చేయగా ఎం.సుబ్బు దర్శకత్వం వహించారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఏపీ సాంస్కృతిక నాటక పరిషత్ సమాఖ్య అధ్యక్షుడు వెంకట రామారావు

వాఘా సరిహద్దులో మోతుగూడెం యూత్

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెం యువకులు ఇండియా-పాకిస్తాన్ సరిహద్దు వాఘాలో రిపబ్లిక్ డే వేడుకలు జరుపుకున్నారు. యూత్ సభ్యులు ఎండీ జాకీర్, సందీప్, పలుకూరి రామరాజు, చింతా వినోద్, పరిమళ హేమంత్ జాతీయ జెండాను ఎగురవేసి భారతీయులుగా గర్వపడుతున్నామని చెప్పారు. ఈ సంఘటన తమ జీవితంలో అత్యంత విలువైనదని పేర్కొన్నారు.

- మోతుగూడెం (ఆంధ్రజ్యోతి)



వాఘా బోర్డర్‌లో జాతీయ జెండాతో మోతుగూడెం యువకులు

చెట్టుకు ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలం పాత బొమ్మూరుకి చెందిన మర్రి రాజారత్నకుమార్ (23) అనే యువకుడు తన ఇంటికి సమీపంలోని చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయన మద్యానికి బానిసై ఇంట్లో గొడవలు పడి రెండుసార్లు ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కానీ అతని తల్లిదండ్రులు కాపాడుకున్నారు. ఈ క్రమంలో విజయవాడలో ఉంటున్న పెద్ద కుమారుడు ఇంటికి శనివారం తల్లిదండ్రులు వెళ్లారు. దీంతో మానసిక సమస్యలతో బాధపడుతున్న రాజారత్నకుమార్ ఆత్మహత్య చేసుకున్నాడు. బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ రహదారిపై .. ట్రాలీ లారీ బోల్తా

- డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం




ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్న పోలీసులు

దివాన్‌చెరువు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి దివాన్‌చెరువు సమీపంలో ఆదివారం ఇనుప ఊచల లోడ్‌తో వెళ్తున్న ట్రాలీ బోల్తా పడింది. డ్రైవర్ అప్రమత్తతంగా వ్యవహరించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బొమ్మూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఎస్ఐ ఎస్.పి కుమార్ వివరాలు తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో లారీ క్యాబిన్‌లో ఇరుకున్న డ్రైవర్ మహ్మద్ ఆదిల్‌ను బయటకు తీశారు.

అతిపెద్ద పర్వతాన్ని.. అధిరోహించిన ఆచంట ఉమేష్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ పర్వతారోహకుడు ఆచంట ఉమేష్ ఆస్ట్రేలియా ఖండంలోనే అతిపెద్ద పర్వతాన్ని అధిరోహించాడు. రిపబ్లిక్ డే సందర్భంగా మౌంట్‌కో జిస్కోను అధిరోహించి జాతీయ జెండాను ప్రదర్శించాడు. ఈ పర్వతం ప్రపంచంలో ఏడు ఖండాల్లో అతి పెద్దది. దీనిఎత్తు 2228 మీటర్లు, ఉమేష్ స్పెషల్ పర్మిషన్ తీసుకుని గైడ్ లేకుండా సొంతంగా వెళ్లాడు.



మౌంట్ కోజిస్కో పర్వతంపై జెండాతో ఉమేష్



భారీ ట్రాలీ

84 టైర్లతో జాతీయ రహదారిపై ఒడిశా వైపు పయనం

పిఠాపురం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి 216పై ట్యాంకర్‌ను తీసుకెళ్తున్న భారీ ట్రాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కాకినాడ నుంచి ఒడిశా వెళ్తున్న ఈ ట్రాలీకి 84 టైర్లు ఉన్నాయి. తిమ్మాపురం వద్దకు శనివారం చేరిన ఈ ట్రాలీ పిఠాపురం బైపాస్ రోడ్డుకు ఆదివారం చేరుకుంది. పిఠాపురం-గొల్లప్రోలు మధ్య టోల్‌గేట్ దాటే అవకాశం లేకపోవడంతో ప్రత్యామ్నాయ మార్గంలో మళ్లించారు. టోల్‌గేటు దాటిన తర్వాత సాయంత్రం వరకు ట్రాలీని అక్కడే నిలిపి ఉంచగా ప్రజలు ఆసక్తిగా తిలకించారు.



విరవాడలో 250 అడుగుల జాతీయ జెండా

పిఠాపురం రూరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం విరవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 250 అడుగుల జాతీయ జెండాతో ప్రదర్శన నిర్వహించారు. పతాకంతో గ్రామ వీధుల్లో ర్యాలీ జరిపారు.



వాలీబాల్ టోర్నమెంటు లోగోను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు

ఫిబ్రవరి 26 నుంచి గొల్లవిల్లిలో ఏఎస్ఆర్ నేషనల్ వాలీబాల్ టోర్నమెంటు

ఉప్పలగుప్తం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి జడ్పీ హైస్కూలు క్రీడా ప్రాంగణంలో నాలుగు రోజులపాటు నిర్వహించనున్న అరిగెల శ్రీరంగయ్య జాతీయ ఇన్విటేషన్ వాలీబాల్ పోటీల లోగోను గొల్లవిల్లిలోని అరిగెల వెంకటనరసింహారావు గృహ ప్రాంగణంలో టోర్నమెంటు గౌరవాధ్యక్షుడు, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆదివారం ఆవిష్కరించారు. టోర్నమెంటు అధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగినమీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1988 నుంచి వాలీబాల్ జాతీయ పోటీలు నిర్వహిస్తూ గొల్లవిల్లి ప్రత్యేక గుర్తింపు పొందిందని వివరించారు. త్వరలో జిల్లాలో క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేస్తామన్నారు. గొల్లవిల్లి టోర్నమెంటుకు ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు. టోర్నమెంటు అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఫిబ్రవరి 26 నుంచి మార్చి ఒకటో తేదీ వరకు టోర్నమెంటు జరుగుతుందన్నారు. వాలీబాల్ నేషనల్ ఫెడరేషన్‌లో ఇప్పటికే రిజిస్ట్రేషన్ జరిగిందన్నారు. ఫ్లడ్ లైట్ వెలుగుల్లో డే అండ్ నైట్ పోటీలు నిర్వహించనున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ఆముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, మాజీ ఎమ్మెల్యే చిల్లా జగదీశ్వరి, టోర్నమెంటు ముఖ్య సలహాదారు అరిగెలనానాజీ, సాంకేతిక సలహాదారు వుండ్రు రాజబాబు, ఉపాధ్యక్షులు మద్దింశెట్టి సురేష్, సలాది నాగరాజు, ప్రధాన కార్యదర్శి అరిగెల నరేష్, కార్యనిర్వాహక కార్యదర్శి, పీడీ గొలకోటి ఫణీంద్రకుమార్, కోశాధికారి గనిశెట్టి తాతాజీ, సంయుక్త కార్యదర్శులు గుత్తుల శ్రీనివాస్, గుత్తాల సుభాష్‌చంద్రరావు, కార్యవర్గ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఇది మాకు గ్రాండ్ సంక్రాంతి

'సంక్రాంతికి వస్తున్నాం' విజయ యాత్రలో హీరో వెంకటేష్, డైరెక్టర్ అనిల్ రావిపూడి

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): 'సంక్రాంతికి వస్తున్నాం' మాకు గ్రాండ్ సంక్రాంతి అయ్యిందని ఆ చిత్ర హీరో విక్టరీ వెంకటేష్, డైరెక్టర్ అనిల్ రావిపూడి ఆనందం వ్యక్తం చేశారు. విజయ యాత్రలో భాగంగా ఈ చిత్రం ప్రదర్శితమవుతున్న శ్యామల థియేటర్‌కి హీరో వెంకటేష్, దర్శకుడు అనిల్ రావిపూడి, హీరోయిన్ మీనాక్షి చౌదరి, నటుడు శ్రీనివాసరెడ్డి, నిర్మాత శిరీష్ ఆదివారం మార్నింగ్ షో సమయంలో విచ్చేశారు. వారికి మైత్రి ఫిలిం డిస్ట్రిబ్యూటర్స్ ప్రతినిధులు ఉదయరాజు, సత్తిరెడ్డి డప్పు వాయిద్యాలతో ఘన స్వాగతం పలికి పుష్పమాలలతో సత్కరించారు. చిత్ర యూనిట్ సభ్యులను థియేటర్లోకి తీసుకెళ్లి ప్రేక్షకులను పరిచయం చేశారు. ప్రేక్షకులకు అభివాదం చేస్తూ పలకరిస్తూ సినిమా గురించి స్పందన తెలుసుకున్నారు. సినిమాను విజయవంతం చేసిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం థియేటర్ ఆవరణలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో హీరో వెంకటేష్ మాట్లాడుతూ ప్రేక్షకులంతా ఈ సినిమాను బాగా ఆదరిస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. గోదావరి యాసతో మాట్లాడడం సినిమాకు బాగా కలిసివచ్చిందన్నారు. గోదావరి జిల్లాలు సినిమా షూటింగ్‌లకు అనుకూలమన్నారు. దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ తమ కాంబినేషన్లో ఎఫ్2 నుంచి చూస్తే ఇది మూడవ సినిమా అని.... 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాకు పెద్ద హిట్ ఇచ్చారన్నారు. బుల్లిరాజు పాత్ర డైలాగ్స్‌లో ఎలాంటి కాంట్రవర్సీ లేదన్నారు.ఆ డైలాగ్స్ కోసమే ప్రేక్షకులు సినిమాను ఐదారుసార్లు చూసి బాగా ఎంజాయ్ చేస్తున్నారన్నారు. నిర్మాత శిరీష్ మాట్లాడుతూ ఈ సినిమాకు అన్నిచోట్లా మంచి టాక్ ఉందని, ముఖ్యంగా తూర్పు గోదావరిలో అద్భుత స్పందన ఉందని, ఇక్కడ వసూళ్లు రూ.10 కోట్లు దాటాయన్నారు. హీరోయిన్ మీనాక్షి చౌదరి మాట్లాడుతూ ఈ సినిమా తనకు పెద్ద హిట్ ఇచ్చిందన్నారు. అనంతరం వెంకటేష్, రానా అభిమానులు కోరుమిల్లి రాజశేఖర్, జాన హనుమంతరావు నేతృత్వంలో అభిమానులతో కలిసి హీరో వెంకటేష్ కేక్ కట్ చేశారు.



శ్యామల థియేటర్లో ప్రేక్షకులకు అభివాదం చేస్తున్న హీరో, డైరెక్టర్



55 ఏళ్ల అనంతరం పూర్వ విద్యార్థుల గ్రూప్ ఫొటో

ఎన్నేళ్లో వేచిన ఉదయం

పెద్దాపురం వీర్రాజు హైస్కూల్లో ఏడు పదుల వయసులో విద్యార్థుల కలయిక

పెద్దాపురం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఏరా ఎలా ఉన్నావు.... ఏమి చేస్తున్నావు... ఎక్కడ ఉంటు న్నావు.... ఇలా ఒకరికొకరు ఆప్యాయం గా పలకరించుకుంటూ ఏడు పదుల వయసులో ఉన్నవారంతా సందడి చేశారు. కాకినాడ జిల్లా పెద్దాపురంలోని వీర్రాజు హైస్కూల్లో 1969-70 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పుడు చేసిన చిలిపి పనులను గుర్తుచేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. ఏడు దశాబ్దాల తర్వాత కలవడంతో ఉద్విగ్నభరిత వాతావరణంలో ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పరవశించిపోయారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన కంభంపాటి గౌరీపతి శాస్త్రి, డ్రిల్ మాస్టర్ స్టీవెన్‌సన్‌లను పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం విందు భోజనాలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముప్పన శ్యామలాంబ, వీర్రాజు, యెండ్రు రామారావు, ముత్యాల రాజబ్బాయి, చల్లా విశ్వనాథం, దుర్గా మోహన్‌రావు, జెట్టి రాజబ్బాయి, మలిరెడ్డి సత్యనారాయణ, తోట మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నాటి గురువును సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

పెట్రోల్ కొట్టించుకుని .. స్కాన్ చేస్తుండగా

- మోటార్ సైకిల్‌తో ఆగంతకుడు పరార్
- చేబ్రోలు పెట్రోల్ బంకులో నాటకీయ పరిణామం

గొల్లప్రోలురూరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్ కొట్టించుకొని డబ్బులు చెల్లించేందుకు ఫోన్‌తో స్కాన్ చేస్తుండగా ఓ ఆగంతకుడు మోటార్‌సైకిల్‌తో పరారయ్యాడు. ఈ నాటకీయ పరిణామం కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు హెచ్‌పీ పెట్రోల్ బంకులో ఆదివారం చోటుచేసుకుంది. మండలంలోని తాటిపర్తికి చెందిన గారపాటి వెంకట్రాజు తన మోటార్‌సైకిల్‌తో చేబ్రోలు శివారులో 216వ జాతీయరహదారిలో ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంకులో పెట్రోల్ కొట్టించుకునేందుకు మధ్యాహ్నం 11.52 గంటల సమయంలో వెళ్లాడు. పెట్రోల్ కొట్టించుకుని డబ్బు లు చెల్లించేందుకు మోటార్‌సైకిల్‌ను పార్క్ చేసి స్కానర్ వద్దకు వెళ్లాడు. ఇంతలో నిక్కరు వేసుకుని షర్ట్ లేకుండా పిచ్చివాడిగా తిరుగుతున్న వ్యక్తి ఆ మోటార్‌సైకిల్‌ను తీసుకుని పరారాయ్యాడు. ఈ మేరకు గొల్లప్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మోటార్‌సైకిల్ తీసుకుని పరారవుతున్న దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. కాగా మోటార్‌సైకిల్ చోరీ చేసిన వ్యక్తి ఆదివారం రాత్రి విశాఖ-శ్రీకాకుళం రోడ్డులో ఎడ్ల బండిని ఢీకొట్టినట్టు తెలుస్తోంది.



చేబ్రోలు పెట్రోల్ బంకు నుంచి పరారవుతున్న వ్యక్తి(సీసీ కెమెరాల్లో)

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుల్లో ... ఒకరి మృతి

ముమ్మిడివరం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్న ఘటనలో గాయపడ్డ నలుగురు యువకుల్లో ఒకరు ఆదివారం మృతిచెందాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం యలకల్లంకకు చెందిన వడ్డి సిరాజ్, ముమ్మిడివరం మండలం అనాతవరానికి చెందిన తాడి పల్లంరాజు మోటారు సైకిల్‌పై శనివారం అమలాపురం నుంచి ముమ్మిడివరం వైపు వెళ్తున్నారు. అదే సమయంలో మలికిపురానికి చెందిన నల్లి వంశీ, గెద్దాడ మణికంఠ మోటారు సైకిల్‌పై కాకినాడ నుంచి మలికిపురం వెళ్తున్నారు. ఈ క్రమంలో ముమ్మిడివరం బైపాస్ రోడ్డు వై.జంక్షన్‌లో వారి వాహనాలు ఢీకొన్నాయి. దీంతో క్షతగాత్రులను అమలాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే వడ్డి సిరాజ్ పరిస్థితి విషమంగా ఉండడంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతిచెందాడు. మిగిలిన ముగ్గురు చికిత్స పొందుతున్నారు. ముమ్మిడివరం ఎస్‌ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సీతానగరం వెల్ఫేర్ అసిస్టెంట్ ఆకస్మిక మృతి



సీతానగరం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): సీతానగరం సచివాలయం -2లో సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కోన పవన్‌కుమార్ (30) ఆదివారం తెల్లవారు జామున ఆకస్మికంగా మృతిచెందాడు. సుమారు నాలుగు గంటల ప్రాంతంలో కడుపునొప్పి రావడంతో వాంతులు చేసుకొని ప్రాణం విడిచినట్టు సచివాలయ సిబ్బంది తెలిపారు. కోరుకొండ మండలం జంబూపట్నంకి చెందిన పవన్ .. తండ్రి మరణాంతరం ఉద్యోగంలో చేరాడు. ఆయన మృతికి పంచాయతీ సర్పంచ్ కోండ్రపు ముత్యాలు, సిబ్బంది సంతాపం వ్యక్తపరిచారు.

'రియల్' మోసం

- జనాల సొమ్ము రూ.నాలుగు కోట్లు వసూలు చేసి వ్యక్తి ఉడాయింపు
- మోసపోయాం.. న్యాయం చేయాలంటూ బాధితుల వేడుకోలు
- మాచవరంలో వ్యాపారి ఇంటి ఎదుట ధర్నా

రాయవరం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నానంటూ ప్రజలను నమ్మబలికి రూ. నాలుగు కోట్లతో ఓ మోసగాడు ఉడాయించాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం మాచవరంలో ఘటన జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం మాచవరం పల్లపువీధి రామాలయం సమీపంలో కర్రి వెంటరెడ్డి అలియాస్ దత్తుడు అలియాస్ దొరబాబు అనే వ్యక్తి నివాసం ఉంటున్నాడు. ప్రజలతో నమ్మకంగా మెలిగిన సదరు వెంకటరెడ్డి తనకు కాకినాడలో డీమార్ట్ సమీపంలో భూములు ఉన్నాయని, కాకినాడ మున్సిపాలిటీలో ఒక ఉద్యోగి ద్వారా రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నానని, పెట్రోల్ బంక్, తదితర వ్యాపారాలు ఉన్నాయంటూ నమ్మబలికాడు. దీంతో మాచవరం, అనపర్తి మండలం పులుగుర్త గ్రామాలకు చెందిన సుమారు 45 మంది రైతులు, తదితర వారి వద్ద నుంచి సొంత అవసరాలు, కుమార్తె పెళ్లి ఖర్చుల నిమిత్తం నగదు రూ. నాలుగు కోట్లు అప్పుగా తీసుకున్నాడు. అప్పులు ఇచ్చిన వ్యక్తులకు వెంకటరెడ్డి మూడు నెలలుగా తిరిగి సొమ్ములు చెల్లించక పోవడంతో అనుమానం వచ్చింది. దీంతో గ్రామపెద్దల్లో పెట్టి సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయిందని వారంతా వాపోయారు. ఈ క్రమంలో ఆదివారం వెంకటర్‌రెడ్డి ఇంటి ఎదుట బాధితులంతా ధర్నాకు దిగారు. తమ పిల్లల చదువు, పెళ్లిళ్ల నిమిత్తం దాచుకున్న సొమ్ములను ఇప్పించాలని వేడుకుంటున్నారు. ఈ సంఘటనపై రాయవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.



వెంకటరెడ్డి ఇంటి ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు



పూజా కార్యక్రమంలో భక్తులు

లోవకు పోటెత్తిన భక్తులు

ఆలయానికి రూ. 3.12 లక్షల ఆదాయం

తుని రూరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): తూర్పు కనుమల్లో కొలువై ప్రసిద్ధి పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు వేలాదిగా పోటెత్తారు.తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి జనం రావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ప్రత్యేక క్యూలైన్లలో బారులు తీరారు. దర్శనం అనంతరం కుటుంబ సమేతంగా ఆదివారం ఒక్కరోజే వివిధ విభాగాలద్వారా రూ. 3.12 లక్షల ఆదాయం సమకూరినట్టు ఉప కమిషనర్, ఆలయ ఈవో పి.విశ్వనాథరాజు తెలిపారు.

వేడుకగా సత్యదేవుడి ఆర్జిత రథసేవ



రథోత్సవంలో సహాయ కమిషనర్ రామ్మోహనరావు

అన్నవరం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి వాసుడు సత్యదేవుడి వారాంతపు ఆర్జిత రథసేవను ఆదివారం వేడుకగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్లను టేకు రథంపైకి తెచ్చారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల గోవిందనామస్మరణ, పండితుల వేదమంత్రోచ్చారణల నడుమ తూర్పు రాజగోపురం చుట్టూ ప్రదక్షిణ గావించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి భీమవరానికి చెందిన భక్తుడు జీ.సోమవెంకట కార్తీక్ రూ.1,00,116 విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయ ఈవో సుబ్బారావుకు అందించారు. ఈ సందర్భంగా ఆయన్ని అభినందించి, స్వామివారి ప్రత్యేక దర్శనం, ప్రసాదాన్ని బహూకరించారు.

ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో
ఘనంగా రిపబ్లిక్ డే వేడుకలు



పతాకానికి వందనం సమర్పిస్తున్న బీఎం శ్రీనివాసరావు, ఎడిషన్ ఇన్‌చార్జి బీహెచ్‌వీ మంగేష్, సిబ్బంది

దివాన్‌చెరువు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): దేశ రాజ్యాంగ విశిష్టతను ప్రతిఒక్కరూ గౌరవించాలని, అది మనందరి కర్తవ్యమని ఆంధ్రజ్యోతి బ్రాంచి మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం రాజానగరం మండలం దివాన్‌చెరువులోని యూనిట్ కార్యాలయంలో రిపబ్లిక్ డే వేడుకను ఘనంగా నిర్వహించారు. ముందుగా గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీఎం మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత రాజ్యాంగాన్ని ఆమోదించిన రోజున ఈ వేడుకను జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఎడిషన్ ఇన్‌ఛార్జి బీహెచ్‌వీ మంగేష్ మాట్లాడుతూ రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కుల వల్లే నేడు మనం స్వేచ్ఛా జీవితాన్ని అనుభవిస్తున్నామన్నారు. జిల్లా స్టాఫర్ ఎస్.ఎస్.ఎస్. సత్యనారాయణ మాట్లాడుతూ అందరికీ విద్య అవసరమని, దీనితోనే జీవితంలో మార్పు సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో సర్క్యులేషన్ మేనేజర్ బీ. గోపాలకృష్ణ, ఏబీఎన్ రిపోర్టర్ కే.రాజాబాబు, సబ్‌ఎడిటర్లు వీజీ మహేశ్వరరావు, జీ.శేషగిరిరావు, ఎస్.రవికుమార్, సిస్టమ్ ఇన్‌ఛార్జి ఎన్.శివకుమార్, రిపోర్టర్ కాదంబరి శ్రీనివాస్, ఫొటోగ్రాఫర్ ఎస్.రాంబాబు, ఏబీఎన్ కెమెరామెన్ సతీష్, యాడ్స్ విభాగం నుంచి ఎం.రవీంద్ర, బీవీ సుబ్రహ్మణ్యం, వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది జి.వీరభద్రరాజు, శివ, కిరణ్, సంతోష్, టి.శ్రీనివాస్, డీ.మహేష్, సెక్యూరిటీ సూపర్‌వైజర్ కే. సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న 126 కిలోల గంజాయి పట్టివేత

మోతుగూడెం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెంలో 126 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలివి.. ఎస్‌ఐకు వచ్చిన సమాచారం మేరకు ఆదివారం పోలీసుస్టేషన్ ఎదురుగా ఉన్న చెక్‌పోస్టు వద్ద వాహనాలను ఆపి తనిఖీ చేస్తుండగా అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఆరుగురిని పట్టుకొని అరెస్టు చేశారు. వీరంతా తెలంగాణ రాష్ట్రం పెద్దపల్లి జిల్లాలోని కొత్తపల్లికి చెందిన మేరుగు సాదయ్య, ఫైడి చింతలపల్లికి చెందిన రంగు రమేష్, గుర్రం సురేష్, మల్లాపురానికి చెందిన వడ్ల రాజీర్, జగిత్యాల జిల్లా మల్లాపురానికి చెందిన గుడ్ల చంద్రశేఖర్, హనుమాన్‌వాడ భోగా అనిల్‌కుమార్. రెండు కారుల్లో వచ్చారు. గంజాయి విలువ రూ.6.30 లక్షలు ఉంటుందని పోలీసులు చెప్పారు. తనిఖీల్లో ఎస్‌ఐ కే. శివనారాయణ, ఏఎస్‌ఐ రాజేశ్వరరావు, హెచ్‌సీఎస్ పురుషోత్తం, కొండబాబు, పీసీ సన్యాసిరావు, ఏఆర్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.



నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

గుండెపోటుతో వీఆర్వో మృతి



రాయవరం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రాయవరం మండలం పసలపూడి వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న తాతపూడి అబ్బాయి (57) ఆదివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. వీఆర్వో కుమారుడు తులసీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. కొంతకాలంగా అబ్బాయి అనారోగ్యంతో బాధపడుతున్నట్టు కుటుంబీకులు చెప్పారు. ఈయనకి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు తులసీధర్ వెదురుపాక గ్రామ వ్యవసాయ సహాయకుడిగా పని చేస్తున్నారు. అబ్బాయి అంత్యక్రియలు ఆయన స్వగ్రామమైన ఆలమూరు మండలం నవాబుపేటలో నిర్వహించారు. వీఆర్వో మృతిపట్ల తహశీల్దారు ఐపీ శెట్టి, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది , తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..

ఆంధ్రజ్యోతి

ఆధ్యాత్మిక ధామం..

సమస్యలతో సతమతం!

- ప్రముఖ పుణ్య క్షేత్రాల కొలువు
- మరిన్ని క్షేత్రాలకు ప్రధాన మార్గం ఇదే
- పిఠాపురం 18వ వార్డులో ప్రజల ఇబ్బందులు తీరేదెన్నడో..

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

పట్టణం: పిఠాపురం
ప్రాంతం: 18వ వార్డు
జనాభా: 3,200
ఓటర్లు: 1896

ప్రధాన ప్రాంతాలు: కుంతీమాధవస్వామి ఆలయం వీధి, నూకాలమ్మ తల్లి, లక్ష్మీదేవి ఆలయాలు, తిమ్మరాజు వీధి, బొబ్బట్ల సుబ్బారావు దుకాణం వీధి (ఆవంత్స సోమ సుందర్ వీధి), వెలంపేట, కోటవారి వీధి, పాత యాదవ వీధి, గుట్ల వీధి, కాకినాడ రోడ్డు, బారు వారి వీధి, రెడ్డెం వారి వీధి.

పిఠాపురం పట్టణంలోని అది పెద్ద వార్డుల్లో ఒకటిగా ఉన్న 18వ వార్డులో సమస్యలు అదే స్థాయిలో ఉన్నాయి. చిన్న చిన్న సమస్యలను తక్షణం పరిష్కరించే వీలున్నా వాటిపై దృష్టి పెట్టకపోవడంతో ప్రజల ఇక్కట్లు తీరట్లేదు. లేదు. గతంలో కొన్నింటికి నిధులు మంజూరైనా పనులు మాత్రం ముందుకు సాగలేదు. అన్ని ప్రాంతాల్లో సీసీ రోడ్లతో అభివృద్ధి చెందిన ప్రాంతంగా పైకి కనిపించినా కొన్ని ఏరియాలకు ఇప్పటికీ తాగునీటి సరఫరా పైపులైన్లు లేవు. కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. పారిశుధ్య నిర్వహణ అంతంతమాత్రమే. ఇది ఈ ప్రాంతం మీదుగా వెళ్లే భక్తులకు ఇబ్బందికరంగా మారింది.

ఆధ్యాత్మికతకు పెట్టింది పేరు

దేశంలో పంచమాధవ క్షేత్రాల్లో ఒకటిగా విరాజిల్లుతున్న కుంతీమాధవస్వామి దేవస్థానం ఈ వార్డులోనే ఉంది. పట్టణ ప్రజలు అమ్మవారిగా కొలిచే నూకాలమ్మ తల్లి ఆలయం, లక్ష్మీదేవి, సకలేశ్వరస్వామి ఆలయాలు ఇక్కడే కొలువై ఉన్నాయి. శ్రీపాద శ్రీవల్లభుల జన్మస్థానంగా ప్రసిద్ధి గాంచిన శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానానికి ఈ మార్గంలోనే వెళ్లాలి. పాదగయ, మహాసంస్థానానికి వచ్చే భక్తులు ఇక్కడి ఆలయాలకు వెళ్తారు. సాధారణ రోజుల్లో వందల సంఖ్యలో, పర్వదినాలు, పండుగల సమయంలో వేల సంఖ్యలో భక్తులు రాకపోకలు సాగిస్తుండడంతో ఎల్లప్పుడూ ఆధ్యాత్మిక వాతావరణం ఉంటుంది. ప్రముఖ కవి, విమర్శకుడు డాక్టర్ ఆవంత్స సోమసుందర్ ఇదే వార్డులో నివాసముండేవారు.

అపారిశుధ్యంతో ఇబ్బంది

వార్డులో అపారిశుధ్య పరిస్థితులతో స్థానికులతోపాటు ఈ ప్రాంతానికి వచ్చే ఉత్తరాది, ఉభయ తెలుగు రాష్ట్రాల భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం చెత్తాచెదారం తీయకపోవడం, డ్రైన్లలో పూడిక తొలగించకపోవడం, పలు ప్రాంతాల్లో డ్రైన్లు శిథిలావస్థకు చేరినా మరమ్మతులు నిర్వహించకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఇళ్లలో డస్ట్‌బిన్లలో ఉంచిన చెత్తను పారిశుధ్య సిబ్బంది తీసుకువెళ్లకపోవడంతో వారు రోడ్డు మీద, విద్యుత్ స్తంభాల వద్ద పడవేస్తున్నారు. తిమ్మరాజు వీధి, దాసరి వారి సందు, కుంతీమాధవస్వామి ఆలయం నుంచి శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానానికి వెళ్లే మార్గంలో ఈ దుస్థితి ఉంది.

ఇక్కడ తాగునీటి సరఫరాయే లేదు

గుట్ల వీధిలోని ఒక భాగానికి పైపులైన్లు లేకపోవడంతో 100 కుటుంబాలు తాగునీటికి అల్లాడుతున్నాయి. కనీసం రూ.5లక్షలు వెచ్చిస్తే ప్రజలందరికీ తాగునీరు అందే పరిస్థితి ఉన్నా ఎవరూ దృష్టిపెట్టలేదు. మరోవైపు పలు వీధుల్లో మునిసిపల్ కుళాయిలు అలంకార ప్రాయమయ్యాయి. కుళాయిల వాల్వ్‌లు తుప్పు పట్టి ఉండడం, కొన్నింటికి ట్యాప్‌లు లేకపోవడంతో నీరు రావట్లేదు. దీంతో తాగు, వాడుక నీరు కోసం అవస్థలు పడుతున్నారు.

వెలగని వీధి దీపాలు

వీధి దీపాల నిర్వహణ అధ్వానంగా ఉంది. పలు ప్రాంతాల్లో వీధిలైట్లు ఉన్నా వెలగట్లేదు. దాసరి వారి సందు, నూకాలమ్మ తల్లి ఆలయం, గుట్ల వీధి, కాకినాడ రోడ్డు, కుంతీమాధవుని కోనేరు ఏరియాల్లో వీధి దీపాలు వెలగక రాత్రిళ్లు అంధకారంలో ఉంటున్నాయి. సుమారు 15 ప్రాంతాల్లో కొత్తగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. దాసరి వారి సందు, ఆవంత్స సోమసుందర్ ఇంటి ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలపై పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతోపాటు పలుచోట్ల కరెంటు వైర్లు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. వీటిని సరిచేయాలని పలుమార్లు విద్యుత్ శాఖాధికారులను కోరినా స్పందించలేదని అక్కడి ప్రజలు చెబుతున్నారు.

అసంపూర్తిగా రోడ్లు

వార్డులో పలు ప్రాంతాల్లో రోడ్లను అసంపూర్తిగా నిర్మించి వదిలివేశారు. గత ప్రభుత్వ హయాంలో 'గడపగడపకు ప్రభుత్వం'లో భాగంగా సీసీ రోడ్లు నిర్మించారు. నిధులున్నా నూకాలమ్మ తల్లి ఆలయం ఎదురుగా ఉన్న రహదారి అభివృద్ధిని విస్మరించారు. దీంతో రోడ్డు ఒకవైపు ఎత్తుగా ఉండడంతో ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

ప్రమాదకరంగా మలుపు

కుంతీమాధవస్వామి దేవస్థానం నుంచి ప్రధాన ఆర్‌అండ్‌బీ రహదారి వెళ్లే మార్గంలో మలుపు ప్రమాదకరంగా మారింది. ప్రధాన రహదారిపై వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో దేవస్థానం రోడ్డు నుంచి వాహనాలు ఢీకొని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రాత్రి సమయాల్లో పరిస్థితి దారుణంగా ఉంటోంది. ఇక్కడ స్పీడ్ బ్రేకర్లు, ఇండికేషన్ ల్యాంప్ బోర్డులు ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉంది.





పిఠాపురం తిమ్మరాజు వీధిలో రహదారిపై పేరుకుపోయిన చెత్తాచెదారం



ఇళ్ల ముందే మురుగునీరంతా..

పాత యాదవ వీధిలో ఇళ్ల ముందేము రుగునీరు నిలిచిపోతోంది. పాత ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా ఉన్న వీధి తదితర ప్రాంతాల్లో రోడ్ కం డ్రైనేజీలు నిర్మించాలని గత ప్రభుత్వ హయాంలో ప్రతిపాదనలు వెళ్లగా నిధులు మంజూరై టెండర్లు పిలిచారు. పనులు జరగలేదు. మురుగునీరు ఎక్కడిక్కడ నిలిచిపోవడంతో దోమల బెడదతో ప్రజలు పాట్లు పడుతున్నారు.



అలంకారప్రాయంగా కుళాయిలు

తాగునీటి సరఫరా పైపులైన్లు పాతబడిపోయి పలుచోట్ల లీకేజీలు ఏర్పడడంతో కుళాయిల ద్వారా నీటి సరఫరా అంతంత మాత్రంగానే ఉంటోంది. కొన్ని ప్రాంతాల్లో ఐదు నిమిషాలు కూడా తాగునీరు రావట్లేదు. పైపులైన్లు పూర్తిగా పాడైనా మరమ్మతులతోనే సరిపెడుతున్నారు. కొత్త పైపులైన్లు వేయకపోవడంతో మరమ్మతులు నిర్వహించిన వారంలోనే పరిస్థితి మొదటికి వస్తోంది. అదే సమయంలో మరమ్మతుల నిమిత్తం సీసీ రోడ్లును తవ్వేసి వదిలివేస్తుండటం ఇబ్బందికరంగా మారుతోంది. రిపేర్ల తర్వాత వాటిని మరలా కాంక్రీటుతో పూడ్చాల్సి ఉన్నా ఆవిధంగా చేయట్లేదు.



కుంతీ మాధవుని కోనేరుపై నిర్లక్ష్యం

పురాతనమైన కుంతీమాధవుని కోనేరుపై నిర్లక్ష్యం కొనసాగుతోంది. తూర్పు చాళుక్యులకాలం నాటి ఈ కోనేరులోనే స్వామి వారి కల్యాణోత్సవాల సమయంలో తెప్పోత్సవం జరిగేది. కాకినాడ ఆర్డీవోగా రేఖారాణి ఉన్న సమయంలో ఈ కోనేరును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంతోపాటు సోలార్ ల్యాంపులు ఏర్పాటుచేశారు. తదనంతరం వీటిని ఎవరు పట్టించుకోలేదు. దీంతో కోనేరు చుట్టూ ఆక్రమణలు పెరిగిపోయాయి. చెత్తాచెదారాన్ని కోనేరులో వేస్తుండడంతో నీరు పూర్తిగా పాడైంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో కోనేరు ఆధునికీకరణ, సుందరీకరణ పనులకు కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి రూ.50 లక్షలు మంజూరయ్యాయి. ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యంతో పనులు జరగలేదు. ఈ పనుల పూర్తిస్థాయి నిర్వహణకు మరో రూ.50 లక్షలు అందించేందుకు అప్పట్లో అధికారులు అంగీకరించారు. గతంలో మంజూరు చేసిన నిధులు మురిగిపోయాయి. ఇప్పటికైనా ఈ కోనేరుపై దృష్టి పెట్టాల్సి ఉంది.

జనాభిప్రాయం ఇలా..

కుళాయిలు సక్రమంగా రావట్లేదు



మా వార్డులో కుళాయిల నుంచి నీరు సక్రమంగా రావట్లేదు. కాలువల్లో తాగునీటి పైపులైన్లు ఉండడంతో కలుషిత నీరు వస్తోంది. పబ్లిక్ కుళాయిలకు ట్యాప్‌లు లేకపోవడం, పలుచోట్ల తుప్పుపట్టి ఉండడంతో నీరు వృథాతోపాటు కొన్నిచోట్ల ధారగా వస్తోంది.
- టీవీవీ సత్యనారాయణ, తిమ్మరాజు వీధి

నిధులున్నా రోడ్డు నిర్మించలేదు



నూకాలమ్మ తల్లి ఆలయం ఎదురుగా ఉన్న రహదారి అభివృద్ధికి గతంలో నిధులు మంజూరయ్యాయి. నిధులున్నా ఇప్పటివరకు పనులు చేయలేదు. అర్ధంతరంగా నిలిపివేసిన పనులతో ఎత్తువల్లాలుగా ఉన్న రోడ్డుతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు.
- అనంతపల్లి రత్నారావు, కోట వారి వీధి

కరెంటు వైర్లు వేలాడుతున్నా..



మా వీధి, సమీప ప్రాంతాల్లో కరెంటు వైర్లు వేలాడుతూ ఉన్నాయి. స్తంభాలపై పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. ఈ వైర్లు తెగిపోయి ఎవరిమీదైనా పడతాయని ఆందోళన చెందుతున్నాం. గాలి వీస్తే సరఫరా నిలిచిపోతోంది.
- దాసరి విజయ, దాసరి వారి వీధి

పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది



వార్డులో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది. చెత్తాచెదారాన్ని సక్రమంగా తీయట్లేదు. కొన్ని ప్రాంతాల్లో రోజుల తరబడి డ్రైన్లు తీయకపోవడంతో మురికికూపాలుగా మారుతున్నాయి. కాలువల్లో పూడికను మేమే తీసుకుంటున్నాం. కొన్నిచోట్ల మురుగునీరు నిలిచిపోయి అవస్థలుపడుతున్నాం.
- ముద్రగడ కృష్ణవేణి, బారు వారి వీధి

స్వాతంత్ర్యం, స్వేచ్ఛకంటే విలువైనవి ఏవీ లేవు: జేఎన్టీయూకే వీసీ



జేఎన్టీయూకే, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యం, స్వేచ్ఛకంటే విలువైనవి ఏవీ లేవని, భిన్నత్వంలో ఏకత్వానికి భారతదేశం అద్భుతమైన ఉదాహరణ అని జేఎన్టీయూకే ఇన్‌చార్జి ఉప కులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. వర్సిటీ ఆవరణలో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, ఎన్‌సీసీ క్యాడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. వర్సిటీలో స్మోక్, ఆల్కహాల్ డిటెక్టర్లతో ఒక డ్రోన్‌ను అభివృద్ధి చేస్తున్నామని, దీనిద్వారా చెడువ్యసనాలను నిరోధించేందుకు వీలు కలుగుతుందన్నారు. విద్యార్థులు ఆలపించిన దేశభక్తి గేయాలు, సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, పలువురు డైరెక్టర్లు, పీడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

హిమావతి నేత్రాల దానం



హిమావతి (పాత చిత్రం)

యానాం (తాళ్లరేవు), జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి తాళ్లరేవు విలేకరి పూడా వెంకటరమణ సతీమణి హిమావతి (45) ఆదివారం అకాల మృతి చెందారు. ఆమె నేత్రాలను బాదం బాలకృష్ణ ఐ బ్యాంకుకు దానం చేశారు. వెంకటరమణను ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, కూటమి నేతలు గుత్తుల సాయి, టేకుమూడి లక్ష్మణరావు, అత్తిలి బాబూరావు, వాడ్రేవు వీరబాబు, వేగేశ్న భాస్కరరాజు, దూళిపూడి బాబి, జక్కల ప్రసాద్‌బాబు, పల్లి సత్తిబాబు, కట్ట త్రిమూర్తులు, ప్రజా సంఘాల నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, వల్లు రాజబాబు పరామర్శించారు.

ఘనంగా గణతంత్ర దినోత్సవం

జీజీహెచ్ (ఆంధ్రజ్యోతి), జనవరి 26: కాకినాడలో గణతంత్ర వేడుకలు అంబరాన్నంటాయి. రంగరాయ వైద్య కళాశాల (ఆర్ఎంసీ)లో ప్రిన్సిపాల్, ఈఎంఈ, డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ డీఎస్ వీఎల్ నరసింహం జాతీయ జెండాను ఎగురవేసి వందన సమర్పణ చేశారు. ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్, డాక్టర్ శశి, ఫోరెన్సిక్ హెచ్‌వోడీ డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు, శస్త్ర చికిత్స నిపుణురాలు డాక్టర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ జెండా వందనం చేశారు. డీఎల్‌వో డాక్టర్ రమేష్, డీఐవో డాక్టర్ సుబ్బరాజు, డాక్టర్ ప్రభాకర్, డెమో ప్రసాదరాజు, డాక్టర్ రవికుమార్, ఏవో దేవకుమారి, ఎస్‌వో విజయలక్ష్మి పాల్గొన్నారు.

కాకినాడ సిటీ (ఆంధ్రజ్యోతి): ఎన్జీవో హోంలో జాతీయ జెండాను ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, ఏపీ జేఏసీ జిల్లా చైర్మన్ గుద్దటి రామ్మోహనరావు ఎగురవేశారు. జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, సహాధ్యక్షుడు మట్టపర్తి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు పాలపర్తి మూర్తిబాబు, సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్, మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, జిల్లా కో-చైర్‌పర్సన్ భారతి, జిల్లా కన్వీనర్ దేవి పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా ఎగురవేశారు. నాయకుడు ఎండీ సయ్యద్, ములస బాబూరావు, సత్యనారాయణ, సేలం సూర్యనారాయణ, ములస నాగేశ్వరరావు, కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.

జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి మల్లిపూడి రాంబాబు, కాకినాడ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు చెక్కా నూకరాజు, నాయకులు మొయ్యేటి సూర్యప్రకాశరావు, పబ్బినీడి కృష్ణ, దవులూరి దనకోటి, బావిశెట్టి సత్యనారాయణ, బండారు జయప్రకాష్, బత్తుల లలిత తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో గణతంత్ర వేడుకలు నిర్వహించారు. కమిషనరు భావన జాతీయ జెండాను ఆవిష్కరించారు. అడిషనల్ కమిషనరు కేటీ సుధాకర్, డిప్యూటీ కమిషనరు మనోహర్, కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, ఎస్ఈ కామేశ్వరరావు, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, టీపీఆర్వో శైలజ, మేనేజరు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ)లో గణతంత్ర దినోత్సవం నిర్వహించారు. స్పోర్ట్స్ మీట్‌లో విజేతలుగా నిలిచిన ట్రైనీలకు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందించినట్టు ప్రధానాధికారి ఎంవీజీ వర్మ తెలిపారు.

కాకినాడ రూరల్ (ఆంధ్రజ్యోతి): ఐడియల్ డిగ్రీ కళాశాలలో కార్యదర్శి, కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవినీకుమారి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఎం.విశ్వేశ్వరరావు, డాక్టర్ ఎన్ఎస్ మూర్తి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రిన్సిపాల్ సత్యనారాయణ, పీడీ పి.శ్రీను, ఎన్‌సీసీ అధికారి స్వామీజీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో కె.శ్రీరమణి, డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ శ్రీహరిరాజు, రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు సీహెచ్ వెంకటలక్ష్మి, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో డి.శ్రీలలిత జాతీయ పతాకాలను ఆవిష్కరించారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోర్టుల ప్రాంగణంలో 12వ అదనపు జిల్లా జడ్జి ఎ.వాసంతి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించగా న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్, ఇతర పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. పురపాలక సంఘ కార్యాలయంలో కమిషనరు కనకారావు, సర్కిల్ కార్యాలయంలో సీఐ శ్రీనివాస్, పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐలు మణికుమార్, జానీబాషా, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ వీవీ రమాదేవి, తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు వీవీ గోపాలకృష్ణ, ప్రభుత్వాసుపత్రిలో సూపరింటెండెంట్ సుజాత, ఎక్సైజ్ స్టేషన్‌లో ఎక్సైజు సీఐ సీతారామరాజు జాతీయ పతాకాలను ఎగురవేశారు.

విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధులను స్ఫూర్తిగా తీసుకోవాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ సూచించారు. బాదం మాధవరావు ప్రభుత్వ బాలికోన్నత ప్లస్ పాఠశాలలో ఆయన జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. పరీక్షల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేశారు. ప్రిన్సిపాల్ శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు. భాష్యం స్కూలులో జాతీయ నాయకుల వేషధారణల్లో విద్యార్థులు అలరించారు. ప్రిన్సిపాల్ పోలుపర్తి వేణు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు నగర పంచాయతీ కార్యాలయంలో ఏఈ ప్రభాకర్, చైర్‌పర్సన్ మంగతాయారు, తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు సత్యనారాయణ, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కర్రి స్వప్న, పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ రామకృష్ణ, సొసైటీలో కార్యదర్శి సూరిబాబు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. బాలికోన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ బుర్రా కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.



పెద్దాపురంలో గణతంత్ర వేడుకల్లో ఆర్డీవో శ్రీరమణి

సర్పవరం జంక్షన్ (ఆంధజ్యోతి): కాకినాడ రూరల్‌లో ఎంపీడీవో పసుపులేటి సతీష్, తహసీల్దారు ఎస్ఎల్ఎన్ కుమారి, సెబ్రాజ్ సీఈవో కాశీవిశ్వేశ్వరరావు, సర్పవరం సీఐ బి.పెద్దిరాజు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. వలసపాకల మెయిన్ ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్ ఎ.నాగమణి ఆధ్వర్యంలో 36 అడుగుల త్రివర్ణ పతాకంతో విద్యార్థులు నిర్వహించిన ర్యాలీ ఆకట్టుకుంది. విద్యార్థులు దేశ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలు, పాటలు, డాన్సులతో అలరించారు. విద్యార్థుల దేశభక్తిని ఎంఈవో బి.వేణుగోపాల్ అభినందించారు. ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌లో కమాండెంట్ ఎం.దీపిక జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేఎస్ఎస్ విద్యాసంస్థల ఆవరణలో జాతీయ పతాకాన్ని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆవిష్కరించారు. సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించి విద్యార్థులను అభినందించారు. తహసీల్దారు కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి కార్యాలయ సిబ్బందికి, విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. డిప్యూటీ తహసీల్దారు వై.శ్రీనివాస్, సూపరింటెండెంట్ పద్మజ, వీఆర్వోలు మామిడాల కామరాజు, నలజర్ల మురళీకృష్ణ, కేవీవీ శ్రీను, పద్మనాభం ఏడుకొండలు, వాసు, ఖాదర్‌వల్లీ పాల్గొన్నారు. ఎంపీడీవో కె.హిమమహేశ్వరి జాతీయ పతాకం ఎగురవేయగా జాతీయ నాయకుల విగ్రహాలకు ఎంపీపీ సత్తిబాబు నివాళులర్పించారు. సామర్లకోట రైల్వే స్టేషన్‌లో సూపరింటెండెంట్ ఎం. రమేష్ జాతీయ పతాకం ఎగురవేయగా రైల్వే ఎస్ఐ బొట్టా లోవరాజు, ఆర్పీఎఫ్ ఎస్ఐ రామకృష్ణ, స్టేషన్ మేనేజరు శ్రీదేవి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



జాతీయ పతాకం ఎగరవేస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

ఎస్పీ కార్యాలయంలో..

కాకినాడ క్రైం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. పోలీస్ బ్యాండ్‌తో జాతీయ గీతాన్ని ఆలపించారు. అడ్మిన్ ఎస్పీ ఎంజేవీ భాస్కర్‌రావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, ట్రైనీ ఏఎస్పీ సుస్మిత, ఎస్టీ డీఎస్పీ సీహెచ్ శ్రీరామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యానాం (తాళ్లరేవు) (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కె.సత్యనారాయణ, తహసీల్దారు పితాని త్రినాథరావు, కోరంగి ఎస్ఐ వి.సత్యనారాయణ, ఎక్సైజ్ సీఐ కె.కోటేశ్వర్, తాళ్లరేవు హైస్కూలు హెచ్ఎం ఆశాలత, సీహెచ్‌సీ దంత వైద్యుడు మూర్తి జాతీయ జెండాలను ఎగురవేశారు. ఎంపీపీ రాయుడు సునీత మాట్లాడుతూ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలన్నారు. తాళ్లరేవు హైస్కూల్లో విద్యార్థులు నిర్వహించిన స్కౌట్, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో రవికుమార్, తహసీల్దారు చిన్నారావు, ఎస్ఐ జి. వెంకటేష్, వెటర్నరీ డాక్టర్ శ్రీమన్నారాయణ, డాక్టర్ సందీప్‌రెడ్డి జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. వాకతిప్ప, కొత్తపల్లి ఉన్నత పాఠశాలలు పంచాయతీలు, సచివాలయాల్లో గణతంత్ర వేడుకలు నిర్వహించారు.


పిఠాపురం మునిసిపల్ కమిషనరుకు ఉత్తమ అవార్డు

పిఠాపురం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలకు అందించిన సేవలకు మునిసిపల్ కమిషనరు నామా కనకారావుకు ఉత్తమ అధికారి అవార్డు లభించింది. కాకినాడలో జరిగిన గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ షాన్‌మోహన్ నుంచి అవార్డు అందుకున్న కనకారావును పలువురు అభినందించారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్న వేణుగోపాలస్వామి దేవస్థానం అర్చకుడు పి.విజయజనార్దనాచార్యులుకు ఉత్తమ సేవా అవార్డును కలెక్టర్ అందజేశారు. పిఠాపురం తహసీల్దారు వీవీ గోపాలకృష్ణ, ఎంపీడీవో చిన్నారావు, క్రైం కానిస్టేబుల్ విష్ణులకు ఉత్తమ అవార్డులు లభించాయి.





అవార్డులు అందుకుంటున్న కమిషనరు కనకారావు, అర్చకుడు జనార్దనాచార్యులు



జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

» ప్రముఖ పుణ్య క్షేత్రాల కొలువు
» మరిన్ని క్షేత్రాలకు ప్రధాన మార్గం ఇదే
» పిఠాపురం 18వ వార్డులో ప్రజల ఇబ్బందులు తీరేదెన్నడో..

ఆధ్యాత్మిక ధామం..

సమస్యలతో సతమతం!

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

పట్టణం: పిఠాపురం
ప్రాంతం: 18వ వార్డు
జనాభా: 3,200
ఓటర్లు: 1896

ప్రధాన ప్రాంతాలు: కుంతీమాధవస్వామి ఆలయం వీధి, నూకాలమ్మ తల్లి, లక్ష్మీదేవి ఆలయాలు, తిమ్మరాజు వీధి, బొబ్బట్ల సుబ్బారావు దుకాణం వీధి (ఆవంత్స సోమ సుందర్ వీధి), వెలంపేట, కోటవారి వీధి, పాత యాదవ వీధి, గుట్ల వీధి, కాకినాడ రోడ్డు, బారు వారి వీధి, రెడ్డెం వారి వీధి.

పిఠాపురం పట్టణంలోని అది పెద్ద వార్డుల్లో ఒకటిగా ఉన్న 18వ వార్డులో సమస్యలు అదే స్థాయిలో ఉన్నాయి. చిన్న చిన్న సమస్యలను తక్షణం పరిష్కరించే వీలున్నా వాటిపై దృష్టి పెట్టకపోవడంతో ప్రజల ఇక్కట్లు తీరట్లేదు. లేదు. గతంలో కొన్నింటికి నిధులు మంజూరైనా పనులు మాత్రం ముందుకు సాగలేదు. అన్ని ప్రాంతాల్లో సీసీ రోడ్లతో అభివృద్ధి చెందిన ప్రాంతంగా పైకి కనిపించినా కొన్ని ఏరియాలకు ఇప్పటికీ తాగునీటి సరఫరా పైపులైన్లు లేవు. కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. పారిశుధ్య నిర్వహణ అంతంతమాత్రమే. ఇది ఈ ప్రాంతం మీదుగా వెళ్లే భక్తులకు ఇబ్బందికరంగా మారింది.

ఆధ్యాత్మికతకు పెట్టింది పేరు

దేశంలో పంచమాధవ క్షేత్రాల్లో ఒకటిగా విరాజిల్లుతున్న కుంతీమాధవస్వామి దేవస్థానం ఈ వార్డులోనే ఉంది. పట్టణ ప్రజలు అమ్మవారిగా కొలిచే నూకాలమ్మ తల్లి ఆలయం, లక్ష్మీదేవి, సకలేశ్వరస్వామి ఆలయాలు ఇక్కడే కొలువై ఉన్నాయి. శ్రీపాద శ్రీవల్లభుల జన్మస్థానంగా ప్రసిద్ధి గాంచిన శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానానికి ఈ మార్గంలోనే వెళ్లాలి. పాదగయ, మహాసంస్థానానికి వచ్చే భక్తులు ఇక్కడి ఆలయాలకు వెళ్తారు. సాధారణ రోజుల్లో వందల సంఖ్యలో, పర్వదినాలు, పండుగల సమయంలో వేల సంఖ్యలో భక్తులు రాకపోకలు సాగిస్తుండడంతో ఎల్లప్పుడూ ఆధ్యాత్మిక వాతావరణం ఉంటుంది. ప్రముఖ కవి, విమర్శకుడు డాక్టర్ ఆవంత్స సోమసుందర్ ఇదే వార్డులో నివాసముండేవారు.

అపారిశుధ్యంతో ఇబ్బంది

వార్డులో అపారిశుధ్య పరిస్థితులతో స్థానికులతోపాటు ఈ ప్రాంతానికి వచ్చే ఉత్తరాది, ఉభయ తెలుగు రాష్ట్రాల భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం చెత్తాచెదారం తీయకపోవడం, డ్రైన్లలో పూడిక తొలగించకపోవడం, పలు ప్రాంతాల్లో డ్రైన్లు శిథిలావస్థకు చేరినా మరమ్మతులు నిర్వహించకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఇళ్లలో డస్ట్‌బిన్లలో ఉంచిన చెత్తను పారిశుధ్య సిబ్బంది తీసుకువెళ్లకపోవడంతో వారు రోడ్డు మీద, విద్యుత్ స్తంభాల వద్ద పడవేస్తున్నారు. తిమ్మరాజు వీధి, దాసరి వారి సందు, కుంతీమాధవస్వామి ఆలయం నుంచి శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానానికి వెళ్లే మార్గంలో ఈ దుస్థితి ఉంది.

ఇక్కడ తాగునీటి సరఫరాయే లేదు

గుట్ల వీధిలోని ఒక భాగానికి పైపులైన్లు లేకపోవడంతో 100 కుటుంబాలు తాగునీటికి అల్లాడుతున్నాయి. కనీసం రూ.5లక్షలు వెచ్చిస్తే ప్రజలందరికీ తాగునీరు అందే పరిస్థితి ఉన్నా ఎవరూ దృష్టిపెట్టలేదు. మరోవైపు పలు వీధుల్లో మునిసిపల్ కుళాయిలు అలంకార ప్రాయమయ్యాయి. కుళాయిల వాల్వ్‌లు తుప్పు పట్టి ఉండడం, కొన్నింటికి ట్యాప్‌లు లేకపోవడంతో నీరు రావట్లేదు. దీంతో తాగు, వాడుక నీరు కోసం అవస్థలు పడుతున్నారు.

వెలగని వీధి దీపాలు

వీధి దీపాల నిర్వహణ అధ్వానంగా ఉంది. పలు ప్రాంతాల్లో వీధిలైట్లు ఉన్నా వెలగట్లేదు. దాసరి వారి సందు, నూకాలమ్మ తల్లి ఆలయం, గుట్ల వీధి, కాకినాడ రోడ్డు, కుంతీమాధవుని కోనేరు ఏరియాల్లో వీధి దీపాలు వెలగక రాత్రిళ్లు అంధకారంలో ఉంటున్నాయి. సుమారు 15 ప్రాంతాల్లో కొత్తగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. దాసరి వారి సందు, ఆవంత్స సోమసుందర్ ఇంటి ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలపై పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతోపాటు పలుచోట్ల కరెంటు వైర్లు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. వీటిని సరిచేయాలని పలుమార్లు విద్యుత్ శాఖాధికారులను కోరినా స్పందించలేదని అక్కడి ప్రజలు చెబుతున్నారు.



అసంపూర్తిగా రోడ్లు

వార్డులో పలు ప్రాంతాల్లో రోడ్లను అసంపూర్తిగా నిర్మించి వదిలివేశారు. గత ప్రభుత్వ హయాంలో 'గడపగడపకు ప్రభుత్వం'లో భాగంగా సీసీ రోడ్లు నిర్మించారు. నిధులున్నా నూకాలమ్మ తల్లి ఆలయం ఎదురుగా ఉన్న రహదారి అభివృద్ధిని విస్మరించారు. దీంతో రోడ్డు ఒకవైపు ఎత్తుగా ఉండడంతో ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

ప్రమాదకరంగా మలుపు

కుంతీమాధవస్వామి దేవస్థానం నుంచి ప్రధాన ఆర్‌అండ్‌బీ రహదారి వెళ్లే మార్గంలో మలుపు ప్రమాదకరంగా మారింది. ప్రధాన రహదారిపై వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో దేవస్థానం రోడ్డు నుంచి వాహనాలు ఢీకొని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రాత్రి సమయాల్లో పరిస్థితి దారుణంగా ఉంటోంది. ఇక్కడ స్పీడ్ బ్రేకర్లు, ఇండికేషన్ ల్యాంప్ బోర్డులు ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉంది.



ఇళ్ల ముందే మురుగునీరంతా..

పాత యాదవ వీధిలో ఇళ్ల ముందే మురుగునీరు నిలిచిపోతోంది. పాత ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా ఉన్న వీధి తదితర ప్రాంతాల్లో రోడ్ కం డ్రైనేజీలు నిర్మించాలని గత ప్రభుత్వ హయాంలో ప్రతిపాదనలు వెళ్లగా నిధులు మంజూరై టెండర్లు పిలిచారు. పనులు జరగలేదు. మురుగునీరు ఎక్కడిక్కడ నిలిచిపోవడంతో దోమల బెడదతో ప్రజలు పాట్లు పడుతున్నారు.



అలంకారప్రాయంగా కుళాయిలు

తాగునీటి సరఫరా పైపులైన్లు పాతబడిపోయి పలుచోట్ల లీకేజీలు ఏర్పడడంతో కుళాయిల ద్వారా నీటి సరఫరా అంతంతమాత్రంగానే ఉంటోంది. కొన్ని ప్రాంతాల్లో ఐదు నిమిషాలు కూడా తాగునీరు రావట్లేదు. పైపులైన్లు పూర్తిగా పాడైనా మరమ్మతులతోనే సరిపెడుతున్నారు. కొత్తపైపులైన్లు వేయకపోవడంతో మరమ్మతులు నిర్వహించిన వారంలోనే పరిస్థితి మొదటికి వస్తోంది. అదే సమయంలో మరమ్మతుల నిమిత్తం సీసీ రోడ్లను తవ్వేసి వదిలివేస్తుండటం ఇబ్బందికరంగా మారుతోంది. రిపేర్ల తర్వాత వాటిని మరలా కాంక్రీటుతో పూడ్చాల్సి ఉన్నా ఆవిధంగా చేయట్లేదు.



కుంతీ మాధవుని కోనేరుపై నిర్లక్ష్యం

పురాతనమైన కుంతీమాధవుని కోనేరుపై నిర్లక్ష్యం కొనసాగుతోంది. తూర్పు చాళుక్యులకాలం నాటి ఈ కోనేరులోనే స్వామి వారి కల్యాణోత్సవాల సమయంలో తెప్పోత్సవం జరిగేది. కాకినాడ ఆర్డీవోగా రేఖారాణి ఉన్న సమయంలో ఈ కోనేరును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంతోపాటు సోలార్ ల్యాంపులు ఏర్పాటుచేశారు. తదనంతరం వీటిని ఎవరు పట్టించుకోలేదు. దీంతో కోనేరు చుట్టూ ఆక్రమణలు పెరిగిపోయాయి. చెత్తాచెదారాన్ని కోనేరులో వేస్తుండడంతో నీరు పూర్తిగా పాడైంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో కోనేరు ఆధునికీకరణ, సుందరీకరణ పనులకు కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి రూ.50 లక్షలు మంజూరయ్యాయి. ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యంతో పనులు జరగలేదు. ఈ పనుల పూర్తిస్థాయి నిర్వహణకు మరో రూ.50 లక్షలు అందించేందుకు అప్పట్లో అధికారులు అంగీకరించారు. గతంలో మంజూరు చేసిన నిధులు మురిగిపోయాయి. ఇప్పటికైనా ఈ కోనేరుపై దృష్టి పెట్టాల్సి ఉంది.



పిఠాపురం తిమ్మరాజు వీధిలో రహదారిపై పేరుకుపోయిన చెత్తాచెదారం

జనాభిప్రాయం ఇలా..

కుళాయిలు సక్రమంగా రావట్లేదు



మా వార్డులో కుళాయిల నుంచి నీరు సక్రమంగా రావట్లేదు. కాలువల్లో తాగునీటి పైపులైన్లు ఉండడంతో కలుషిత నీరు వస్తోంది. పబ్లిక్ కుళాయిలకు ట్యాప్‌లు లేకపోవడం, పలుచోట్ల తుప్పుపట్టి ఉండడంతో నీరు వృథాతోపాటు కొన్నిచోట్ల ధారగా వస్తోంది.

- టీవీవీ సత్యనారాయణ, తిమ్మరాజు వీధి

నిధులున్నా రోడ్డు నిర్మించలేదు



నూకాలమ్మ తల్లి ఆలయం ఎదురుగా ఉన్న రహదారి అభివృద్ధికి గతంలో నిధులు మంజూరయ్యాయి. నిధులున్నా ఇప్పటివరకు పనులు చేయలేదు. అర్ధంతరంగా నిలిపివేసిన పనులతో ఎత్తుపల్లాలుగా ఉన్న రోడ్డుతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు.

- అనంతపల్లి రత్నారావు, కోట వారి వీధి

కరెంటు వైర్లు వేలాడుతున్నా..



మా వీధి, సమీప ప్రాంతాల్లో కరెంటు వైర్లు వేలాడుతూ ఉన్నాయి. స్తంభాలపై పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. ఈ వైర్లు తెగిపోయి ఎవరిమీదైనా పడతాయని ఆందోళన చెందుతున్నాం. గాలి వీస్తే సరఫరా నిలిచిపోతోంది.

- దాసరి విజయ, దాసరి వారి వీధి

పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది



వార్డులో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది. చెత్తాచెదారాన్ని సక్రమంగా తీయట్లేదు. కొన్ని ప్రాంతాల్లో రోజుల తరబడి డ్రైన్లు తీయకపోవడంతో మురికికూపాలుగా మారుతున్నాయి. కాలువల్లో పూడికను మేమే తీసుకుంటున్నాం. కొన్నిచోట్ల మురుగునీరు నిలిచిపోయి అవస్థలుపడుతున్నాం.

- ముద్రగడ కృష్ణవేణి, బారు వారి వీధి

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

మువ్వన్నెల జెండా రెపరెపలు

చింతూరు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ప్రజల అభివృద్ధే లక్ష్యంగా చింతూరు ఐటీడీఏ ఒక ప్రణాళిక మేరకు అడుగులు వేస్తోందని ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ అన్నారు. ఆదివారం ఆదిమగురుకుల కళాశాల ప్రాంగణంలో గణతంత్ర వేడుకలు నిర్వహించారు. పీవో భరత్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆయా రంగాల్లో ఉత్తమ సేవలందించిన డివిజన్ పరిధిలోని 185మంది ఉద్యోగులకు పీవో భరత్ ప్రశంసా పత్రాలు అందజేశారు.

ఎటపాక, (ఆంధ్రజ్యోతి): ఆదివారం ఏజెన్సీలో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. పాఠశాలలు, పోలీస్ స్టేషన్, గ్రామ సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఎగురవేశారు. అచ్చుతాపురం జీపీఎస్‌లో 50 అడుగుల జాతీయ జెండాతో గ్రామంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

వీఆర్‌పురం, (ఆంధ్రజ్యోతి): మండలంలో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. రేఖపల్లిలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏఈ రామకృష్ణారెడ్డి, తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ సరస్వతి, అటవీశాఖ కార్యాలయంలో అటవీశాఖ అధికారి రామకృష్ణ, వెలుగు కార్యాలయంలో సీసీ, రేఖపల్లిలోని ఏఎస్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో సంస్థ డైరెక్టర్ వి.గాంధీబాబు జెండాను ఎగురవేశారు.

అడ్డతీగల, (ఆంధ్రజ్యోతి): అడ్డతీగలలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాల్లో, స్వచ్ఛంద సంస్థ, ప్రైవేట్ సంస్థ కార్యాలయాల్లో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. అడ్డతీగల పోలీస్ స్టేషన్ ఆవరణలో సీఐ బి.నరసింహమూర్తి జెండాను ఆవిష్కరించారు. తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో తహశీల్దార్ కె.సూర్యారావు జెండాను ఎగురవేశారు.

రంపచోడవరం, (ఆంధ్రజ్యోతి): రంపచోడవరంలో ఆదివారం గణతంత్ర వేడుకలు ఐటీడీఏ పీవో సింహాచలం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. స్థానిక జూనియర్ కళాశాల గ్రౌండ్స్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తొలుత విద్యార్థినీ, విద్యార్థుల నుంచి పీవో సింహాచలం, సబ్‌కలెక్టర్ కల్పశ్రీ, ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవిలు గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం మన్యంలో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులను ప్రశంసా పత్రాలతో పీవో, సబ్‌కలెక్టర్, ఎమ్మెల్యేలు సత్కరించారు. తొలుత ఐటీడీఏ కార్యాలయంలో పీవో సింహాచలం పతాకావిష్కరణ చేశారు. రంపచోడవరం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ కల్పశ్రీ ఆదివారం పతాకా విష్కరణ చేశారు. ఎన్‌సీసీ క్యాడెట్ల నుంచి గౌరవవందనాన్ని స్వీకరించారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల రక్షణ కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని రంపచోడవరం జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ బాబు పిలుపునిచ్చారు. ఆదివారం రంపచోడవరం, అడ్డతీగల జ్యుడిషియల్ కోర్టుల్లో పతాకా విష్కరణ చేశారు. కార్యాలయం సూపరింటెండెంట్ నాగభూషణం, న్యాయవాదులు ఎ.వి.స త్యనారాయణ, కె.సత్య ప్రసాద్, మాదే బాలస త్యనారాయణ, బి.వెంకటేశ్వర్లు, ఎ.ఆర్.ఆర్.భగవాన్, ఎస్‌కే జిలానీ, టి.వెంకట్రావు, వీరబాబు, శివరంజని తదితరులు పాల్గొన్నారు.



రంపచోడవరం: ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను ఇస్తున్న పీవో, సబ్‌కలెక్టర్, ఎమ్మెల్యే

కూనవరం, (ఆంధ్రజ్యోతి): మండలంలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ఈసందర్భంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించి జాతీయ నాయకులను స్మరించుకున్నారు.ఎంపీడీవో రామాంజనేయులు కలెక్టర్ నుంచి, కూనవరం విద్యుత్ ఏఈ రాజీకపూర్ చింతూరు ఐటీడీఏ పీవో నుంచి ఉత్తమ సేవా అవార్డులు అందుకున్నారు. వీరితో పాటు మరికొందరు అవార్డులు తీసుకున్నారు. కూనవరం అటవీ శాఖ అధికారి కరుణాకర్ ఆధ్వర్యంలో దేశ కీర్తిని వర్ణిస్తూ వేడుకలు జరిగాయి.

దేవీపట్నం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, సచివాలయాల్లో అధికారుల ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. కృష్ణుడుపాలెం తొయ్యేరు ఆర్‌అండ్‌ఆర్ కాలనీ హైస్కూల్‌లో హెచ్‌ఎం కర్రి నూకరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి సర్పంచ్ కుంజం రాజామణి ముఖ్యఅతిథి హాజరయ్యారు.

వై.రామవరం, (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం గణతంత్ర వేడుకలను ఘనంగా జరిపారు. తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ వేణుగోపాల్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అలాగే ఎంపీడీవో, ఎంఈవో, జడ్పీ స్కూల్, మండలంలో ఆశ్రమ, గురుకుల, ఏకలవ్య, పాఠశాలలు, సామాజిక ఆరోగ్య కేంద్రం, సచివాలయం తదితర కార్యాలయాల్లో జెండాలు ఆవిష్కరించారు. ఎంపీపీ ఆనందరావు, జడ్పీటీసీ వెంకటలక్ష్మి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.



రత్నగిరిపై జాతీయ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న ఈవో సుబ్బారావు

జగ్గంపేట, జనవరి 26(ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో ఆదివారం గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. జగ్గంపేట పోలీస్ సర్కిల్ ఆఫీస్ వద్ద సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ జాతీయ జెండా ఎగురవేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చెన్నారావు జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ బాలరాజు, కో ఆర్డినేటర్ డాక్టర్ వీవీ సత్యనారాయణ, అకడమిక్ కో ఆర్డినేటర్ పి.విశ్వేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కొత్త వెంకటేశ్వరరావు హాజరై జాతీయ జెండా ఆవిష్కరించారు. ముందుగా మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు అంజలి ఘటించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాల సంస్థ మాజీ చైర్మన్ ఎస్వీఎస్ అప్పలరాజు పాల్గొన్నారు. విద్యార్థులకు బిస్కెట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొత్త భైరవకృష్ణ, మానేపల్లి బంగార్రాజు, కొత్త రాము, మానేపల్లి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన శ్రీ ప్రజ్ఞ విద్యార్థుల వేషధారణ: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం జగ్గంపేట శ్రీప్రజ్ఞ విద్యార్థుల వేషధారణ ఆకట్టుకున్నాయి. పాఠశాలలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పట్టణ మెయిన్ రోడ్డులో శోభాయాత్ర జరిపారు. బస్టాండ్ రోడ్డులో నిర్వహించిన విద్యార్థుల పిరమిడ్స్ ఆకర్షించాయి. విద్యా సంస్థల చైర్మన్ బండారు నాగబాబు మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరిపై జాతీయ జెండా రెపరెపలు

అన్నవరం(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ జెండా రెపరెపలాడింది. కళా మందిరం వద్ద ఏర్పాటు చేసిన జాతీయ జెండాను ఈవో సుబ్బారావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో దేవస్థానం ఉద్యోగులు, అర్చకులు, పురోహితులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం(ఆంధ్రజ్యోతి): మండలంలో గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో సూర్యనారాయణ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో కమిషనర్ సత్యనారాయణ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, వైస్ ఎంపీపీలు చిక్కాల రాజ్యలక్ష్మి దేవి, సాదే లోవరాజు, నగర పంచాయతీ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, ఎంపీటీసీలు, కొప్పుల బాబ్జి, పసల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

గండేపల్లి(ఆంధ్రజ్యోతి): మండలంలో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఎగురవేశారు. మురారిలో ఉపసర్పంచ్ జాస్తి వసంత్ ఆధ్వర్యంలో జెండా వందనం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎస్ఐ శివనాగబాబు, తహశీల్దార్ శ్రీనివాస్, ఏవో చంద్రరావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణతంత్ర వేడుకలు


• వాడవాడలా జాతీయ పతాకం రెపరెపలు • ప్రజా ప్రతినిధులు, అధికారుల హాజరు

ఆదిత్యలో గణతంత్ర వేడుకలు: సూరంపాలెంలో ఉన్న ఆదిత్యలో గణతంత్ర వేడుకలు నిర్వహించారు. వైస్ చాన్సలర్ ఆధ్వర్యంలో దీన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా శ్రీనివాస రెడ్డి హాజరై జాతీయ జెండా ఎగురవేశారు.

కోటనందూరు(ఆంధ్రజ్యోతి): మండలంలో గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో జాతీయ జెండాను ఎగుర వేశారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వెంకటనారాయణ, తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ సుభాష్, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ టి.రామకృష్ణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ యామిని, మదర్ విద్యా సంస్థలో చైర్మన్ పెనుముచ్చు నాగేశ్వరరావు, శ్రీసాయి విద్యానికేతన్‌లో బంగారు లక్ష్మి జెండా ఎగురవేశారు. ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్‌లో గణతంత్ర వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ డి.చిరంజీవిరాజు, టీడీపీ నాయకులు వెలగా వెంకటకృష్ణారావు, చింతకాయల రవికుమార్, లగుడు సత్యనారాయణమూర్తి, చందక శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి(ఆంధ్రజ్యోతి): మండలంలో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. కిర్లంపూడి తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ చిరంజీవి, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో హరికృష్ణ, జగపతినగరం పంచాయతీలో సర్పంచ్ శ్రీలత, సెక్రటరీ ఎన్టీఆర్ రమేష్, పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్ వెంకటరమణ, సుబ్బిరెడ్డి, భూపాలపట్నంలో సర్పంచ్ వీరంరెడ్డి కాశీబాబు, గెద్దనాపల్లిలో మాజీ సర్పంచ్ సూరిశెట్టి వెంకటశివ, ముక్కోలులో సర్పంచ్ జ్యోతుల రాంబాబు, ఏలేరు ప్రాజెక్టు చైర్మన్ బస్వా వీరబాబు, తామరాడలో జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ జాతీయ జెండాను ఎగురవేశారు

ప్రత్తిపాడు(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ పతాకాన్ని హెచ్‌ఎం సత్యనారాయణ రెడ్డి ఆవిష్కరించగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ గౌరవ వందనం చేశారు. కూటమి నాయకులు కొమ్ముల కన్నబాబు, సింగిలిదేవ్ సత్తిరాజు, యాళ్ల విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొనగా కోర్టు వద్ద ఇన్‌చార్జ్ జడ్జి ఎం.ప్రసన్న జాతీయ జెండా ఆవిష్కరించారు. బార్ అసోసియేషన్ నాయకుడు రాజాల చిట్టిబాబు, ఎం.మధుబాబు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎం.సూర్యప్రభ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు జెండా ఆవిష్కరించగా ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్ అంబేడ్కర్, గాంధీల చిత్రపటాలకు నివాళులర్పించారు. పోలీస్‌స్టేషన్ వద్ద సీఐ బి.సూర్య అప్పారావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ప్రభుత్వ ఆసుపత్రి వద్ద సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్య జాతీయ జెండా ఆవిష్కరించగా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు వెలుగుల కొండలరావు, బి.వెంకటేశ్వరరావు రిపబ్లిక్ డే గురించి తెలిపారు.



ప్రత్తిపాడు జడ్పీ హైస్కూల్‌లో జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

తుని రూరల్(ఆంధ్రజ్యోతి): తేటగుంట టీడీపీ క్యాంప్ కార్యాలయంలో గణతంత్ర వేడుకలకు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన ఆయన గౌరవ వందనాన్ని స్వీకరించారు.

బైక్ ర్యాలీతో దేశభక్తి చాటిన యువత

తుని రూరల్(ఆంధ్రజ్యోతి): తునిలో పలువురు యువకులు ర్యాలీతో దేశభక్తిని చాటారు. టీం జైహింద్ ఆధ్వర్యంలో రిపబ్లిక్ డే సందర్భంగా గణపతినగర్ పార్కు దగ్గర నుంచి జాతీయ జెండాలతో ప్రదర్శనలు జరిపారు. అనంతరం గొల్ల అప్పారావు సెంటర్‌కు చేరుకుని రిపబ్లిక్ డే శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చదరం బాలు, పి.మార్కండేయులు, చిట్టుమూరి పండు, వంగలపూడి నరేష్ తదితర యువకులు పాల్గొన్నారు.

రౌతులపూడి(ఆంధ్రజ్యోతి): మండల గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలలో గణతంత్ర వేడుకలను నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో స్థానిక అధికారులు, విద్యార్థులు, పలువురు నేతలు పాల్గొన్నారు.

శ్రీ ప్రకాష్‌లో గణతంత్ర వేడుకలు

తుని రూరల్ (ఆంధ్రజ్యోతి): శ్రీ ప్రకాష్ విద్యానికేతన్‌లో గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా గిడుతూరి వెంకట సత్యప్రసాద్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ (ఎంఆర్‌వో) హాజరయ్యారు. ఎన్‌సీసీ విద్యార్థుల కవాతు, పరేడ్‌ను పర్యవేక్షించి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఎన్‌సీసీ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.